
www.aashwi.net / in PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

శుక్రవారం, 19-06-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :50 Issue : 50 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## కుదిరిన ఒప్పందం.. హర్మూజ్ జలసంధికి మళ్లీ ఊపిరి!



ఇరాన్‌అమెరికా మధ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాకు జీవనాడిగా పేర్కొనే హర్మూజ్‌కు మళ్లీ ఊపిరి పోసినట్లయ్యింది. ఆంక్షల నేపథ్యంలో కొంతకాలంగా అక్కడ వందలాది నౌకలు చిక్కుకుపోగా.. తాజాగా పరిస్థితులు కుదుటపడడంతో తిరిగి తమ ప్రయాణాన్ని కొనసాగించేందుకు ఆయా నౌకలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఒప్పందం తక్షణమే అమల్లోకి రావడంతో కొన్ని నౌకలు ఇప్పటికే ఆ మార్గంలో బయలుదేరినట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. కాగా ఈ పరిణామం ప్రపంచ ఇంధన మార్కెట్‌కు పెద్ద ఉపశమనం కలిగించే పరిణామంగా నిపుణులు భావిస్తున్నారు....



## సాయికృష్ణ ఘటనపై సీఎం సీరియస్.. ఉన్నతస్థాయి విచారణకు ఆదేశాలు

4

# ఎల్‌బీ నగర్‌తో ప్రత్యేక అనుబంధం

- కష్టకాలంలో అండగా నిలిచిన ప్రజలకు రుణపడి ఉంటా
- కాంగ్రెస్ కార్యకర్తల పోరాటంతోనే ప్రజా పాలన సాధ్యమైంది
- గుర్రంగూడ వనమహోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి
- మూసీ మురికి కన్నా కల్వకుంట్ల విషం ప్రమాదం
- గుర్రంగూడ ఎకో పార్క్‌లో వనమహోత్సవం
- మొక్కను నాటి ప్రసంగించిన సిఎం రేవంత్ రెడ్డి

**రంగారెడ్డి, జూన్ 18, అశ్వి అప్డేట్:** ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కబ్జాలతో ప్రజలకు సమస్యలు రాకూడదనే హైడ్రా తీసుకువచ్చామని ప్రస్తావించారు. హైడ్రాను ఒక భూతంలా కొందరు చూపెడుతు న్నారని ధ్వజమెత్తారు. హైడ్రా పేదల జోలికి వెళ్లదని.. కబ్జాదారుల భరతం పడుతుందని స్పష్టం చేశారు. గుర్రంగూడ ఎకో పార్క్‌ను కబ్జా చేయాలని కొంతమంది చూశారని ఆరోపించారు. వనస్థలిపురంలో దేవుడి భూములనూ కూడా కబ్జా పెట్టారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం

మిగతా 3వ పేజీలో..





## విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ

- మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభం
- పీవీని ఆదర్శంగా తీసుకోవాలి: కేటీఆర్

**హైదరాబాద్, జూన్ 18, అశ్వి అప్డేట్:** మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మిగతా 3వ పేజీలో..

## రిజిస్ట్రేషన్ సేవలు బంద్

- జూన్ 26 నుంచి 28 వరకు సేవల నిలిపివేత
- జూన్ 29 నుంచి యథావిధిగా సేవలు

3



## 30న రైతు భరోసా నిధులు విడుదల

- వానాకాలం సాగుకు రైతులకు అండగా ప్రభుత్వం
- మధిర వేదికగా సిఎం రేవంత్ చేతుల మీదుగా అందచేత
- ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం
- ధాన్యం కొనుగోళ్లలో కేంద్రం తీరుపై ఆగ్రహం
- వివరాలు వెల్లడించిన మంత్రి ఉత్తమ్ కుమార్

3



## ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

- 11శాతం ఫిట్‌మెంట్ అమలుకు నిర్ణయం
- జూలై 1 నుంచే అమలు చేస్తామన్న మంత్రి పొన్నం

**హైదరాబాద్, జూన్ 18, అశ్వి అప్డేట్:** తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభవార్త చెప్పారు. ఆర్టీసీ సమ్మెలో ఇచ్చిన

మిగతా 2వ పేజీలో..



2

### నీట్ ఎగ్జామ్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం



## కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్ చర్చలు

- సభ్యత్వ నమోదు, శిక్షణా తరగతులపై సమీక్ష
- జీహెచ్ఎంసీ ఎన్నికల సన్నద్ధతపై దిశానిర్దేశం

2

# సన్నవడ్లకు పెరుగుతున్న ధరలు

- కేసముద్రం మార్కెట్లో పెరిగిన కొనుగోళ్లు

**మహబుబాబాద్, జూన్ 18, అశ్వి అప్డేట్:** సన్న ధాన్యానికి మద్దతు పెరుగుతోంది. మార్కెట్లలో మద్దతు ధరలను మించి ధరలు పెంచి కొనుగోళ్లు చేస్తున్నారు. ఈయేడు సరిగా పంటలు పండకపోతే ధరలు పెరుగుతాయన్న భావనలో వ్యాపారులు ఉన్నారు. మహబుబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో ధాన్యం ధర ఈ సీజన్‌లో అత్యధికంగా క్వింటాకు రూ.2,906 నమోదైంది. గత 15 రోజులుగా ఈ మార్కెట్‌లో ఆరఎనఆర్ రకం వడ్లరేట్ రోజురోజుకూ పెరుగుతోంది. స్థానిక మార్కెట్‌కు ఈ `వేలం'లో

మిగతా 2వ పేజీలో..






3

## అవినీతిపై ప్రశ్నిస్తే ఎదురుదాడులా?

- సమాధానం చెప్పకుండా తప్పించుకోలేరు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై కొప్పుల ఫైర్




## ఒడిశాలో ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్

- 500 కిలోల గంజాయి స్వాధీనం
- వాహనం వదిలేసి పరారైన స్మగ్లర్లు

3



## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు

- సునీల్ కుమార్ బెయిల్ పిటిషన్ విచారణ
- ఎప్పటిలోగా లొంగిపోతారో చెప్పాలన్న హైకోర్టు
- విచారణ నేటికి వాయిదా వేసిన కోర్టు

**అమరావతి, జూన్ 18, అశ్వి అప్డేట్:** ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ నాయక్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. ఈ విచారణ సందర్భంగా హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు చేసింది. పార్లమెంట్ సభ్యుడిపై కస్టోడియల్ టార్చర్ వంటి తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక ఐపీఎస్ అధికారికి ముందస్తు బెయిల్ రక్షణగా మారకూడదని స్పష్టం చేసింది. ఈ విచారణ సందర్భంగా న్యాయస్థానం పిటిషనర్‌ను

మిగతా 2వ పేజీలో..

## రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు స్టే

- అందులో 5 ఎకరాలు తమవేనంటూ ఎస్‌బిఐ పిటిషన్
- కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు

**హైదరాబాద్, జూన్ 18, అశ్వి అప్డేట్:** హైదరాబాద్ రాయదుర్గం భూముల వేలంపై తెలంగాణ హైకోర్టు స్టే విధించింది. మూడు వారాల పాటు స్టే విధిస్తూ మధ్యంతర

మిగతా 3వ పేజీలో..






## పార్టీ లైన్ దాటితే క్షమించేది లేదు

- ఎంతటి వారైనా పార్టీకి కట్టుబడి ఉండాల్సిందే
- క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి

3




## నెత్తురోడిన రాష్ట్ర రహదారులు

- వేర్వేరు ప్రమాదాల్లో 8మంది మృతి
- మేడ్చెల్ వద్ద ప్రమాదంలో ముగ్గురు మృతి
- వరంగల్ రహదారి ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

2

# కేసీఆర్‌తో కేటీఆర్, హరీశ్ చర్చలు

**హైదరాబాద్, అశ్వి అప్డేట్ :**

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు గురువారం సాయంత్రం భేటీ అయ్యారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ నివాసానికి వెళ్లిన ఇద్దరు నేతలు ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతానికి సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.
సమావేశంలో ప్రధానంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, పార్టీ శ్రేణులకు నిర్వహించనున్న శిక్షణా తరగతులు, జీహెచ్ఎంసీ ఎన్నికల సన్నద్ధతపై చర్చ జరిగినట్లు సమాచారం. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపై కేసీఆర్ కేటీఆర్, హరీశ్‌రావులకు పలు సూచనలు చేసినట్లు తెలిసింది.
రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేయడంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.
రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ముఖ్యంగా జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయడంపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది.



## తంత్రీ వాయిద్య కారుడు రామయ్యకు పురస్కారం

- **అభినందనలు తెలిపిన గ్రామస్థులు**

**పెద్దపల్లి, జూన్ 18, అశ్వి అప్డేట్:**

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామానికి చెందిన, కడ్డీ తంత్రి వాయిద్య కళాకారుడు దురిచేటి రామయ్యకు కేంద్ర ప్రభుత్వ పురస్కార్ అవార్డు దక్కింది. ఆయన ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు గురువారం హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్తులు పులి వెంకటేశంతో పాటు పలువురు రామయ్య ఇంటికి వెళ్లి అవార్డుకు ఎంపిక కావడం పట్ల శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అనంతరం శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రామయ్య కుటుంబానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త


**మొదటిపేజీ తరువాయి**

హామీ మేరకు ఉద్యోగులకు జులై 1 నుంచి 11 శాతం ఫిట్‌మెంట్ అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం టీజీఎస‌ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పొన్నం మాట్లాడుతూ.. నాగర్ కర్నూల్, పెద్దపల్లి బస్ డిపో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వేములవాడ, కథలాపూర్ బస్ స్టేషన్లకు త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. హుజూర్‌నగర్, కోదాడ, నాగర్‌కర్నూల్ బస్ స్టేషన్లకు కూడా మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ములుగు బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మహాలక్ష్మి పథకంపై ప్రత్యేక అధ్యయనం చేయాలని సూచించారు. మహిళా సంఘాలకు చెందిన 553 బస్సుల పనితీరుపై మంత్రి నివేదిక కోరారు. రాష్ట్రంలో 1,050 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణపై సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించారు. ఆర్టీసీ వద్ద 10,173 బస్సులు.. 38,128 మంది ఉద్యోగులు ఉన్నారని, రోజుకు 61 లక్షల మంది ప్రయాణికులు టీజీఎస‌ఆర్టీసీ సేవలు పొందుతున్నట్లు తెలిపారు. పెండింగ్ కారుణ్య నియామకాలను వెంటనే పూర్తి చేయాలని అధికారులను పొన్నం ఆదేశించారు. తొలగించిన ఉద్యోగుల్లో 244 మందికి ఇప్పటికే విధుల్లోకి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. ఉద్యోగి శంకర్ కుటుంబానికి రూ.1 కోటి చెక్కును ఆర్టీసీ అందజేయనున్నట్లు తెలిపారు. శంకర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసినట్లు చెప్పారు. దక్షిణ భారత రవాణా శాఖ మంత్రులతో త్వరలో ప్రత్యేక సమావేశం జరగనుందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ముగిసిన బ్రహ్మనాయుడు కస్టడీ

- **కోర్టుకు తరలించిన పోలీసులు**

**హైదరాబాద్, అశ్వి అప్డేట్ :**



ఫేక్ జీవో కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కస్టడీ పూర్తయ్యింది. మూడురోజుల కస్టడీ ముగియడంతో బొల్లా బ్రహ్మనాయుడిని రంగారెడ్డి జిల్లా కోర్టుకు పోలీసులు తరలించారు. బ్రహ్మనాయుడిని సైబరాబాద్ ఈవోడబ్ల్యూ అధికారులు మూడు రోజులపాటు కస్టడీకి తీసుకొని విచారించారు. అయితే కస్టడీలో పోలీసులకు మాజీ ఎమ్మెల్యే ఏమాత్రం సహకరించనట్లు తెలుస్తోంది. ఏ ప్రశ్న అడిగినా 'తెలియదు, గుర్తులేదు' అనే సమాధానాలు చెప్పినట్లు సమాచారం. రూ.1000 కోట్ల భూమిని అక్రమంగా కొట్టేయాలని బ్రహ్మనాయుడు ప్లాన్ చేసినట్టు ఈవోడబ్ల్యూ అధికారుల విచారణలో వెల్లడైంది. భూమిని కొట్టేసేందుకు బ్రహ్మనాయుడు రూ.8 కోట్లు సమకూర్చినట్లు అధికారులు గుర్తించారు. దీనిపైనే ప్రశ్నలు వేయగా.. మాజీ ఎమ్మెల్యే సమాధానాలు దాటవేసినట్లు తెలుస్తోంది. మరికొన్ని ప్రశ్నలకు మౌనంగా ఉంటూ తనకేం తెలియదని బుకాయించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఇప్పటికే ఐదుగురు నిందితులు కస్టడీలో వెల్లడించిన వివరాలను ఆధారంగా చేసుకొని బ్రహ్మనాయుడిని అధికారులు ప్రశ్నించారు. 'వారు చెప్పిన సమాధానాలకు నాకు ఎలాంటి సంబంధం లేదు' అని పోలీసుల ముందు బ్రహ్మనాయుడు బుకాయించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.



# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

- **జర్నలిస్టులకు అవగాహన కార్యక్రమం**

**హైదరాబాద్, అశ్వి అప్డేట్ :**

జర్నలిస్టుల కోసం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అంశంపై తెలంగాణ మీడియా అకాడమి, తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులతో ప్రత్యేక అవగాహన మరియు పరస్పర చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ఈ నెల 22వ తేదీ సోమవారం నాడు ఉదయం 11.00 గంటలకు మీడియా అకాడమి ఆడిటోరియం, చాపెల్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్‌లో నిర్వహించబడుతుంది. ఈ సమావేశంలో ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయ అధికారులు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ, దాని లక్ష్యాలు, అమలు విధానం, ప్రజల భాగస్వామ్యం, ఓటరు నమోదు, సవరణలు తదితర అంశాలపై సమగ్రంగా వివరించనున్నారు. అలాగే జర్నలిస్టులు తమ సందేహాలను నేరుగా అధికారులను అడిగి నివృత్తి చేసుకునే అవకాశం కల్పించబడుతుంది. ఈ కార్యక్రమం మధ్యాహ్నం 1.00 గంటలకు ముగియనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన జర్నలిస్టులు తమ పేర్లను 20వ తేదీ మధ్యాహ్నం 1.00 గంటలలోపు వాట్సాప్ నంబర్ 7093600977 కు పంపి నమోదు చేసుకోవలసిందిగా కోరడమైనది. కార్యక్రమ నిర్వహణ సౌలభ్యం దృష్ట్యా, నిర్దేశిత గడువులోపు తమ పేర్లను నమోదు చేసుకున్న జర్నలిస్టులకు మాత్రమే కార్యక్రమంలో పాల్గొనే అవకాశం కల్పించబడుతుంది.

# రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసు

**మొదటిపేజీ తరువాయి**

ఉద్దేశించి 'ఎప్పటిలోగా సరెండర్ అవుతారని ప్రశ్నించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధిపై కస్టోడియల్ టార్చర్ ఆరోపణలు అత్యంత తీవ్రమైనవని పేర్కొంది. పార్లమెంట్‌పై దాడి చేసిన వ్యక్తులకు, ఒక పార్లమెంట్ సభ్యుడిని కస్టడీలో వేధించిన వారికి మధ్య పెద్ద తేడా లేదని కోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి సంఘటనల్లో పాల్గొనకుండా ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి తనను తాను నియంత్రించుకోవాల్సిన బాధ్యత ఉందని వ్యాఖ్యానించింది. ఎంపీని వేధింపులకు గురిచేయబోతున్నారని సునీల్ కుమార్ నాయక్‌కు ముందే తెలుసునని హైకోర్టు తెలిపింది. ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆయన కీలక పాత్ర పోషించినట్లు ప్రాథమికంగా కనిపిస్తోందని పేర్కొంది. అందువల్ల ఆయన స్వచ్ఛందంగా వెళ్లి పోలీసుల ఎదుట సరెండర్ కావడం మంచిదని సూచించింది. ముందస్తు బెయిల్ కోరుతూ కొనసాగాలా, లేక సరెండర్ అయ్యే మార్గాన్ని ఎంచుకోవాలా అనే విషయంపై నిర్ణయం తీసుకుని కోర్టు ముందు హాజరు కావాలని ఆదేశించింది. సునీల్ కుమార్ నాయక్ తరఫు న్యాయవాది స్పందిస్తూ, పిటిషనర్‌తో సంప్రదించి తదుపరి నిర్ణయాన్ని హైకోర్టుకు తెలియజేస్తామని చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించి కోర్టు ముందు తమ వాదనలు వినిపిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తుది నిర్ణయం తీసుకోకుండా, కేసు విచారణను హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. తదుపరి విచారణలో సునీల్ కుమార్ నాయక్ తరఫు నిర్ణయం, కోర్టు పరిశీలనలు కీలకంగా మారనున్నాయి.




# యూరియా యాప్ తొలగించాల్సిందే

- **బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన**
- **ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వేముల ప్రశాంత్ రెడ్డి**

**నిజామాబాద్, అశ్వి అప్డేట్ :**

యూరియా యాప్‌ను తక్షణం తొలగించాలని డిమాండ్ చేస్తూ నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఆందోళనకు దిగారు. రైతులు, గులాబీ శ్రేణులు పెద్ద ఎత్తున ఈ నిరసన కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ మంత్రి నేతృత్వంలో జాతీయ రహదారిపై నేతలంతా కలిసి బైఠాయించారు. సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ఉసురు పోసుకునేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కొత్త తరహా యూరియా పంపిణీ వ్యవస్థను తీసుకువచ్చిందని ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. దుకాణాల్లో లేని యూరియా బస్తాలు యాప్ ద్వారా ఎలా రైతులకు అందుతాయని ప్రశ్నించారు. యాప్ వల్ల గ్రామాల్లో రైతులు అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. అందుకే యూరియా యాప్ తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యూరియా యాప్ పోవాలి.. రేవంత్ దిగిరావాలి' అంటూ నినాదాలు చేశారు. రైతులకు తక్షణమే యూరియా అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రైతులపై కక్ష సాధింపు చర్యలో భాగంగానే యూరియా యాప్ తెచ్చి రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సకాలంలో రైతుబంధు ఇవ్వక రైతులను ప్రభుత్వం నట్టేట ముంచుతుందని మండిపడ్డారు. బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో రైతును రాజును చేసే ఘనత కేసీఆర్ కే దక్కిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుపై రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నా రేవంత్ సర్కార్ పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. బీఆరఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో రైతులకు ఎరువులు సకాలంలో పథకాలు అందించడంతోపాటు రైతు సంక్షేమం కోరిందని గుర్తు చేశారు.

# నీట్ రీటెస్ట్ నిర్వహణకు పక్కాగా ఏర్పాట్లు

- **వందతులను నమ్మొద్దని విద్యార్థులకు వినతి**
- **21న రీ టెస్టు కోసం ఏర్పాట్లు పూర్తి: ఎన్‌టీఏ**

**న్యూఢిల్లీ, అశ్వి అప్డేట్ :**

నీట్`యంజీ రీటెస్టును పకడ్బందీగా నిర్వహించేందుకు విస్తృతమైన ఏర్పాట్లు చేసినట్లు 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' ఎన్టీఏ తెలిపింది. విద్యార్థులు ప్రశాంతంగా ఉండి.. పరీక్ష సన్నద్ధతపై దృష్టి పెట్టాలని సూచించింది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21న రీటెస్టు ఉంటుందని.. పరీక్ష వాయిదా పడుతుందన్న వదంతులను, సోషల్ మీడియా వేదికగా జరిగే దుష్ప□చారాన్ని నమ్మొద్దని 'ఎక్స' వేదికగా సందేశం విడుదల చేసింది. ఎన్‌టీఏ నుంచి వచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని తెలిపింది. మరోవైపు.. పరీక్ష నిర్వహణపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అభ్యర్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే మే 3నాటి పరీక్షను రద్దు చేశాం. ఈ వ్యవహారం నుంచి పాఠాలు నేర్చుకుని పరీక్షా ప్రక్రియను మరింత బలోపేతం చేశాం. సంబంధిత మంత్రిత్వ శాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, భద్రతా సంస్థల సమన్వయంతో పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పటిష్ఠమైన, బహుళ అంచెల భద్రతా చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. పరీక్ష సంబంధిత ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులు 'మానస' మానసిక ఆరోగ్య హెల్ప్‌లైన్ నంబర్‌ను (14416) సంప్రదించి సాయం కోరవచ్చని ఎన్‌టీఏ సూచించింది. పరీక్షకు ఇంకా మూడు రోజులే మిగిలి ఉన్నాయి. ఇప్పటికే సిద్ధమయ్యారు.. కాబట్టి అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడంపైనే దృష్టి పెట్టండి. ప్రశాంతంగా ఉండండి. బాగా విశ్రాంతి తీసుకోండి. మీ నుంచి ఇదే కోరుకుంటున్నాం అని అభ్యర్థులను ఉద్దేశించి ఎన్‌టీఏ పేర్కొంది. తల్లిదండ్రులు, అధ్యాపకులు కూడా.. విద్యార్థులను ప్రశాంతంగా ఉంచాలని, ధ్రువీకరించని సమాచారాన్ని వారితో షేర్ చేసుకోవద్దని విజ్ఞప్తి చేసింది. వారు స్థిరమైన మనసుతో, నిశ్చింతగా పరీక్షకు వెళ్లేలా చూడాలని సూచించింది. పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో మే 3నాటి నీట్`యంజీ పరీక్ష రద్దయిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది.

# అనుమానాస్పద స్థితిలో దంపతుల మృతి

- **కుమారుడి ఫిర్యాదుతో పోలీసుల దర్యాప్తు**

**కుమ్రంభీం ఆసిఫాబాద్, అశ్వి అప్డేట్ :**

కుమ్రం భీం జిల్లా ఆసిఫాబాద్ మండలంలో అనుమానాస్పద స్థితిలో దంపతులు మృతి చెందడం కలకలం సృష్టిస్తోంది. తుంపల్లి గ్రామపంచాయతీ కోసార గ్రామ పరిధిలోని భవానీ నగర్‌లో దారుణం చోటు చేసుకుంది. బానోత్ రాజు ,సునీత దంపతులు బుధవారం రాత్రి అనుమానాస్పదంగా మృతి చెందారు. ఇద్దరు దంపతులు కొడుకు, కోడలుతో కలిసి భవానీనగర్‌లో జీవనం కొనసాగిస్తున్నారు. రాత్రి భోజనం చేసిన అనంతరం భార్యాభర్తలు ఇద్దరు ఇంటి బయట వరండాలో పడుకున్నారు. రాత్రి 3 గంటల ప్రాంతంలో కరెంట్ పోవడంతో కోడలు తమ చిన్న పాపను అత్త సునీత దగ్గర పడుకోబెట్టేందుకు వచ్చి నిద్ర నుంచి లేపే ప్రయత్నం చేయగా ఆమె నుంచి స్పందన రాకపోవడంతో చూడగా అప్పటికే ఇద్దరు మృతి చెందారు. గతంలో పీరీల విషయంలో గొడవలు జరిగాయని, తమ తల్లిదండ్రులను హత్య చేసి ఉంటారని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆసిఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# నెత్తురోడిన రాష్ట్ర రహదారులు

- **వేర్వేరు ప్రమాదాల్లో 8మంది మృతి**
- **మేడ్చెల్ వద్ద ప్రమాదంలో ముగ్గురు మృతి**

**హైదరాబాద్, జూన్ 18, అశ్వి అప్డేట్:**

రాష్ట్రంలోని రహదారులు నెత్తురోడాయి. వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి చెందారు. హైదరాబాద్ ` వరంగల్ జాతీయ రహదారిపై మినీ ట్రక్కును లారీ ఢీ కొట్టిన ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. ఎస్సై బండి శ్రవణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలంలో కిరాణా దుకాణం నిర్వహించే జాట్ రోహిత్, యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండ కొత్తపల్లికి చెందిన మధు.. టాటా ఏస్ మినీ ట్రక్కులో హైదరాబాద్ నుంచి కిరాణా సామగ్రి తీసుకొస్తుండగా.. తెల్లవారుజామున జనగామ జిల్లా లింగాలఘనపూర్ మండలం నెల్లుట్ల సవి□పంలోకి రాగానే ట్రక్కు టైరు పంక్చర్ అయింది. అదే దారిలో వెళ్తున్న లారీని ఆపి జాకీ తీసుకున్నారు. లారీ క్లీనర్ రాజేందర్, ట్రక్కు □డైవర్ మధు, కిరాణా దుకాణ యజమాని రోహిత్.. పంక్చర్ అయిన టైరును మారుస్తున్న క్రమంలో వెనుక నుంచి మరో లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు జనగామ జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పరిధిలోని తుర్కపల్లి`మురహరిపల్లి మధ్య ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. ఆ తర్వాత అతి వేగంతో ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందిన వెంటనే మేడ్చల్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు ముమ్మరం చేశారు. కారులో నుంచి మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుల వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. ఈ ప్రమాదంతో హైవేపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు యత్నించారు. వికారాబాద్‌జిల్లా పరిగి మండలం చిగురాల్‌పల్లి వద్ద బైక్‌ను టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోమిన్‌కలాన్‌కు చెందిన జావీద్‌పాషా (30) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురు గాయపడ్డారు. హైదరాబాద్ నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న కారు, డీసీఎం వ్యాన్ సిరిసిల్ల బైపాస్‌పై ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న అభిషేక్ అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ముగ్గురు గాయపడ్డారు. కారులో ప్రయాణిస్తున్న వారిది జగిత్యాలగా తెలుస్తోంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.




# నీట్ ఎగ్జామ్ విద్యార్థులకు ఉచిత ప్రయాణం

- **రవాణామంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**హైదరాబాద్, జూన్ 18, అశ్వి అప్డేట్:**

నీట్ పరీక్ష రాసే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన చేశారు . జూన్ 21న జరగనున్న నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ప్రయాణం అందిస్తున్నట్లు ప్రకటించారు . పరీక్షా రాసే విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది నీట్ పరీక్ష కోసం.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కీలక మార్పులను ప్రకటించింది. ఎగ్జామ్ ను మరింత పారదర్శకంగా, సురక్షితంగా, విద్యార్థులకు అనుకూలంగా మార్చేందుకు ఎన్డీఏ కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. గతంలో ఉన్న నిబంధనలను సవరిస్తూ ఈసారి ఎగ్జామ్ టైంను 195 నిమిషాలకు పెంచారు. ఎగ్జామ్ మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు జరగనుంది. ఎగ్జామ్ ప్రారంభానికి ముందు అటెండెన్స్ డాక్యుమెంట్స్ పై సైన్ లు చేయడం, ఇన్విజిలేషన్ లాంఛనాలు పూర్తి చేయడం వంటి పరిపాలనాపరమైన పనుల వల్ల.. విద్యార్థులు తమకు కేటాయించిన రాత సమయాన్ని నష్టపోకూడదనే ఉద్దేశంతో ఎన్టీఏ ఈ అదనపు సమయాన్ని కేటాయించింది. దీనివల్ల అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాయడంపైనే పూర్తిగా దృష్టి పెట్టవచ్చు. ఎగ్జామ్ రోజున విద్యార్థులకు పూర్తి స్పష్టత, సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా తెచ్చిన ఈ కొత్త నిబంధనలను అభ్యర్థులందరూ గమనించాలని ఎన్టీఏ స్పష్టం చేసింది.

# అవినీతిపై ప్రశ్నిస్తే ఎదురుదాడులా?

**కరీంనగర్, జూన్ 18, అశ్వ అప్డేట్:**

ధాన్యం కొనుగోళ్లు, సంక్షేమ హాస్టళ్ల టెండర్లలో భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. ఈ విషయాలపై సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని మండిపడ్డారు. ధర్మపురి నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌లు మాయమయ్యాయన్న అంశం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఈ మేరకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు నిజంగా ధైర్యం ఉంటే మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రజల ముందుకు రావాలని సవాల్ విసిరారు. మంత్రి పదవికి రాజీనామా చేయడం అంత సులభమైన విషయం కాదని, ఎన్నో కష్టాలు పడి ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిచిన లక్ష్మణ్‌కు రాజీనామా చేసే ధైర్యమే లేదని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలు, అవినీతి ఆరోపణలపై సమాధానాలు చెప్పలేక వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. హరీశ్‌రావును 'దొర' అంటూ కులాన్ని ప్రస్తావిస్తూ రాజకీయాలు చేస్తున్నావా? అంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌పై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హాయాంలో కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో సైతం ఏనాడు ఆపలేదని గుర్తుచేశారు. రైతు భీమా ప్రీమియం గడువు పూర్తయి నాలుగు నెలలు అయిందని, రైతులు చనిపోతే ఆ కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. డిస్కం పేరుతో రైతులకు విద్యుత్తు కోతను తీసుకురానున్నారని ఆరోపించారు. రిజర్వాయర్లు, మెయిన్ కెనాల్స్ పూర్తి చేసి వేల ఎకరాలకు నీరిచ్చిన ఘనత బీఆరఎస్ ప్రభుత్వముదేనని, పిల్ల కాలువలు పూర్తి చేస్తే మరిన్ని ఎకరాలకు నీరు అందించవచ్చన్నారు. అడుగడుగునా రైతులను వేధిస్తున్న కాంగ్రెస్ కి ఎవరైనా ఓటు వేస్తారా అంటూ ప్రశ్నించారు. బీఆరఎస్ నాయకులపై కేసులు పెట్టి వేధిస్తున్న కాంగ్రెస్ ఓటమి అంచున ఉందన్నారు. తెలంగాణ బాగుండాలంటే బీఆరఎస్ మళ్లీ గెలిచి కేసిఆర్ ముఖ్యమంత్రి కావాలని ఆయన అన్నారు.

# రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు స్టే

మొదటిపేజీ తరువాయి

ఉత్తర్వులు జారీ చేసింది. మూడు వారాల్లోపు కౌంటర్ దాఖలు చేయాలని ఈ సందర్భంగా ప్రతివాదులను న్యాయస్థానం ఆదేశించింది. రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లోని భూమికి ఇటీవల వేలం నిర్వహించారు. ఈ స్థలాన్ని ఎకరాకు రూ.237కోట్ల చొప్పున గౌరా వెంచర్స్ కొనుగోలు చేసింది. అయితే, ఆ భూమిలో 5 ఎకరాలు తమదేనంటూ హైకోర్టును ఎస్బీఐ బ్యాంక్ ఆశ్రయించింది. ఈ మేరకు పిటిషన్ దాఖలు చేసింది. సర్వే నెంబర్ 83/1లోని 5 ఎకరాల భూమి తిరిగి ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. దీనిపై గురువారం విచారణ చేపట్టిన ధర్మాసనం.. రాయదుర్గం భూముల వేలంపై స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ, టీజీఐఐసీ, గౌర వెంచర్స్‌కు నోటీసులు జారీ చేసింది. రాయదుర్గంలోని పన్మక్తలో టీజీఐఐసీ జరిపిన భూముల వేలంపై ఇటీవల ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. ఆ భూములు తమవేనంటూ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం వేలంపై స్టే విధించింది. ఇటీవల జరిగిన వేలంలో అక్కడ ఎకరం రూ.237 కోట్లు పలికిన సంగతి తెలిసందే. సర్వే నం.83/1లో ఐదు ఎకరాల భూమిపై హక్కులు కోరుతూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. మే 6న జారీ చేసిన వేలం నోటిఫికేషన్‌తోపాటు తదనంతరం జరిగిన భూ విక్రయాన్ని, తమ వినతిపత్రాన్ని తిరస్కరిస్తూ మే 20న జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఎస్‌బీఐ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసింది. రాయదుర్గంలో ఎస్‌బీహెచ్‌కు 2010లో ఐదెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించగా ఇందుకోసం రూ.13.33 కోట్లను చెల్లించింది. ఎస్‌బీఐలో ఎస్‌బీహెచ్ విలీనం కాగా, గతంలో ఈ స్థలంలో ఉన్న రెండు ఏటీఎంలను ఎస్‌బీఐ నిర్వహిస్తోంది. 2020లో గత ప్రభుత్వం భూకేటాయింపును రద్దు చేయగా ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేస్తూ.. ఎస్‌బీఐ అభ్యర్థనను పునఃపరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం 2024లో ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ కేటాయింపును రద్దు చేయడంతో ఎస్‌బీఐ మరోసారి హైకోర్టును ఆశ్రయించింది.

# పార్టీ లైన్ దాటితే క్షమించేది లేదు

**హైదరాబాద్, జూన్ 18, అశ్వ అప్డేట్:**

ఎంతటి వారైనా సరే వారి వ్యక్తిగత సమస్యలను పార్టీపై రుద్ద వద్దని నేతలకు క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. వి□కు ఏమైనా సమస్యలు ఉంటే.. వాటిని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ లేకుంటే రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు వి□నాక్షి నటరాజన్ దృష్టికి తీసుకెళ్లాలని నేతలకు ఆయన సూచించారు. గురువారం గాంధీ భవన్‌లో మల్లు రవి విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ క్రమశిక్షణ కమిటీ ముందు హాజరవుతారన్నారు. కామారెడ్డిలో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారని వివరించారు. షబ్బీర్ ఆలీకి నోటీసులు జారీ చేశామని చెప్పారు. ఆదివారం కమిటీ ముందు హాజరు కావాలని ఆయనకు సూచించామన్నారు. అందుకు షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ముందుగా షబ్బీర్ ఆలీ ఇచ్చిన ఫిర్యాదుపై క్రమశిక్షణ కమిటీ చర్చించిందన్నారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత తమ నిర్ణయం ప్రకటిస్తామని మల్లు రవి వెల్లడించారు. పార్టీ వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించిన క్రమశిక్షణ కమిటీ చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని నేతలకు ఎంపీ మల్లు రవి వార్నింగ్ ఇచ్చారు. పార్టీ క్రమశిక్షణ చైర్మన్, ఎంపీ మల్లు రవిని కలిసి అన్ని విషయాలు వివరించానని కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. నోటీసులపై లిఖిత పూర్వక సమాధానం ఇచ్చానన్నారు. అన్ని విషయాలు పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆయన్ని కోరినట్లు చెప్పారు. వారం రోజుల్లో అన్ని అంశాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని మల్లు రవి తెలిపారని చెప్పారు. కమిటీ ఏ నిర్ణయం తీసుకున్నా అందుకు కట్టుబడి ఉండాలని ఆయన సూచించారని వివరించారు.

# సన్నవడ్లకు పెరుగుతున్న ధరలు

మొదటిపేజీ తరువాయి

క్వింటాకు గరిష్ఠంగా రూ.2,906, కనిష్ఠంగా రూ.2, 226, సగటున రూ.2,589 ధరలతో వ్యాపారులు ఖరీదులు చేశారు. ధాన్యానికి ప్రభుత్వ కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,389 ఉండగా, ఈ సీజన్‌లో అంతకంటే ఎక్కువగానే మార్కెట్లో ధరలు ఉన్నాయి. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉంటాయనే కారణాలతో వ్యాపారులు నిల్వ చేసేందుకు మార్కెట్లో ధాన్యం ఖరీదులు పెంచారు. ఈ క్రమంలో దేశీయంగా ధాన్యానికి డిమాండ్ ఏర్పడడంతో మార్కెట్లో ఈ సీజన్‌లో గత 15 రోజులుగా ధాన్యం సగటు ధర పెరుగుతూ వస్తోంది. ఈ నెల 1న ధాన్యం సగటు ధర రూ.2,475 నుంచి రూ.2,495 వరకు ఉన్నాయి. ఆ తర్వాత ఈనెల 4న సగటు ధర రూ.2, 589, 5న రూ.2636, 8న రూ.2,689, 9న రూ.2,729గా నమోదయ్యాయి. తాజా గా గరిష్ఠ ధర రూ.2,900 మార్కు దాటడం విశేషం.



# ఎల్‌బీ నగర్‌తో ప్రత్యేక అనుబంధం

మొదటిపేజీ తరువాయి



ప్రారంభించారు. హరితనిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ.35.50కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమి చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు. ప్రశ్నించే గొంతు ఉండాలని నాడు ఎంపీగా తనను గెలిపించారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తనను ఓడించాలని కొందరు ఎన్నో కుట్రలు పన్నారని ధ్వజమెత్తారు. ఇక్కడి ప్రజల అభిమానమే తనను ముఖ్యమంత్రిగా నిలబెట్టిందని వివరించారు. ఎల్బీనగర్ ప్రజలు తనకు 30 వేలకుపైగా ఓట్ల మెజారిటీ ఇచ్చారని అన్నారు. తన సొంతూరు కొండారెడ్డిపల్లి లాంటిదే తనకు ఎల్బీనగర్ అని అభివర్ణించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎల్బీనగర్ అభివృద్ధిని పట్టించుకోలేదని మండిపడ్డారు. సీఎంగా ఎల్బీనగర్ సమస్యల పరిష్కారానికి తాను కృషి చేస్తానని మాటిచ్చారు. రంగారెడ్డి జిల్లాకు అన్నివిధాలా అండగా నిలుస్తున్నామని స్పష్టం చేశారు. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాలుష్య కోరల్లో చిక్కుకుని ఢిల్లీ ప్రజలు బాధపడుతున్నారని సీఎం వ్యాఖ్యానించారు. మన హైదరాబాద్‌కు అలాంటి పరిస్థితి రావొద్దనే మొక్కల పెంపకాన్ని ప్రోత్సాహిస్తున్నామని వివరించారు. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారని ఆగ్రహించారు. మూసీ ఒడ్డున నివసిస్తున్న ప్రజలను తరలించి.. అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. ముందు సిద్దిపేట గెలిచిరండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామంటే కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతామని రేవంత్‌రెడ్డి అన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేర ఈ పనులు చేపడతామని చెప్పారు. సబర్మతి, గంగా రివర్‌ఫ్రంట్‌ల కంటే మెరుగ్గా అంతర్జాతీయ స్థాయిలో దీన్ని తీర్చిదిద్దుతామన్నారు. కాలుష్య రహిత వాతావరణం ప్రజలకు ఇవ్వాలని ప్రయత్నిస్తున్నాం. నగర అవసరాల కోసం 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ లేని నేతలు ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని చెబుతున్నారు. వాళ్ల ఫ్యూచర్‌ను ప్రజలు నిర్ణయిస్తే.. ఫాంహౌస్‌కు పరిమితమయ్యారు. ఫ్యూచర్‌సిటీని రద్దు చేస్తానన్న ఆయన ఈసారి సిద్దిపేటలో గెలవరు. కొందరు ఎన్జీటీలో కేసులు వేస్తున్నారు. మూసీలో కాలుష్యం కంటే.. కల్వకుంట్ల వాళ్ల కడుపులో కాలుష్యమే ఎక్కువ. ఎవరు అడ్డుపడినా అంతర్జాతీయస్థాయిలో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మించి తీరుతాం అని అన్నారు. కేసీఆర్ ఫ్యామిలీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గుర్రంగూడలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించారు సీఎం రేవంత్. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే అడ్డుపడుతున్నారని.. మూసీలో ఉండే కాలుష్యం కంటే కల్వకుంట్లోళ్ల కడుపులో విషం ఎక్కువని అన్నారు. మూసీ పునరుజ్జీవం వద్దంటున్న సుధీర్ రెడ్డి గతంలో మూసీ కార్పొరేషన్ చైర్మెన్ పదవి ఎలా తీసుకున్నారని ప్రశ్నించారు. భూకబ్జాలతో ప్రజలకు సమస్య రావొద్దని హైడ్రా తెచ్చామని... హైడ్రాను భూతంలా చూపిస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా పేదల జోలికి వెళ్ళదని.. కబ్జాదారుల భరతం పడుతుందని అన్నారు. ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకొని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. మన హైదరాబాద్ కు ఆ పరిస్థితి రావొద్దని మొక్కల పెంపకం చేపట్టామని అన్నారు.

# రిజిస్ట్రేషన్ సేవలు బంద్

**హైదరాబాద్, జూన్ 25:**



తెలంగాణ రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కీలక ప్రకటన విడుదల చేసింది. సర్వర్ అప్‌గ్రేడేషన్, నిర్వహణ పనుల నేపథ్యంలో జూన్ 26 నుంచి 28 వరకు రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు.

శాఖ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు అనుబంధ ఆన్‌లైన్ సేవలకు సంబంధించిన సాంకేతిక పనులు చేపడుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మూడు రోజుల పాటు రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఆన్‌లైన్ సేవలు, కార్యాలయ సేవలు అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు.

ఐదేళ్ల తర్వాత ఈ స్థాయిలో సర్వర్ అప్‌గ్రేడేషన్ చేపడుతున్నట్లు ఐజీ తెలిపారు. అప్‌గ్రేడేషన్ పూర్తయిన తర్వాత సేవల భద్రత, వేగం, పనితీరు మరింత మెరుగుపడుతాయని చెప్పారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని వివరించారు. రిజిస్ట్రేషన్ సేవలు వినియోగించుకునే వారు ముందస్తుగా తమ పనులను ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచించారు. అత్యవసర రిజిస్ట్రేషన్ అవసరాలు ఉన్నవారు జూన్ 26కు ముందుగానే ప్రక్రియ పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జూన్ 29 నుంచి అన్ని రిజిస్ట్రేషన్ సేవలను యథావిధిగా పునరుద్ధరించి అందుబాటులోకి తీసుకువస్తామని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. అప్‌గ్రేడేషన్ అనంతరం సేవలు మరింత సురక్షితంగా, వేగవంతంగా అందుతాయని పేర్కొన్నారు.

# ఒడిశాలో ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్

**హైదరాబాద్, జూన్ 18:**

గంజాయి అక్రమ రవాణాపై తెలంగాణ ఈగల్ టీమ్ మరో భారీ ఆపరేషన్ నిర్వహించింది. ఒడిశాలోని కోరాపుట్ అటవీ ప్రాంతాల్లో గంజాయి స్మగ్లింగ్ ముఠాను లక్ష్యంగా చేసుకుని చేపట్టిన చర్యల్లో 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుంది. కోరాపుట్ అడవుల నుంచి తెలంగాణకు భారీ మొత్తంలో గంజాయిని తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో ఈగల్ టీమ్ రంగంలోకి దిగింది. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం భారీగా వెంబడించింది. ఈగల్ టీమ్ వెంటాడడంతో స్మగ్లర్లు తాము ప్రయాణిస్తున్న బొలెరో వాహనాన్ని అక్కడే వదిలేసి పరారైనట్లు అధికారులు తెలిపారు. ఘటన స్థలంలో వదిలివేసిన బొలెరో వాహనాన్ని, అందులో ఉన్న సుమారు 500 కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు సమాచారం. రాష్ట్రంలో గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఈగల్ టీమ్ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. గతంలోనూ ఇతర రాష్ట్రాల్లో నిర్వహించిన ఆపరేషన్ల ద్వారా పలు మాదక ద్రవ్యాల ముఠాలను పట్టుకుని కేసులు నమోదు చేసింది. తెలంగాణలో కూడా వరుస దాడులు నిర్వహిస్తూ గంజాయి అక్రమ రవాణా నెట్‌వర్క్‌లపై ఉక్కుపాదం మోపుతోంది.

# విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగుల పంపిణీ

మొదటిపేజీ తరువాయి




విద్యార్థులకు పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని బేగంపేట బ్రాహ్మణవాడిలో ఉన్న స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌ను సందర్శించిన ఆయన విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అలాగే తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 16 భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన పీవీ నరసింహారావు దేశానికే కాక ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడుస్తూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో గొప్ప స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో 2023లో కేసీఆర్ నాయకత్వంలో ప్రారంభించిన సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. విద్యార్థుల సంక్షేమానికి దోహదపడే కార్యక్రమాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా అమలు చేస్తామని తెలిపారు. పిల్లలతో గడిపే ప్రతి క్షణం ఆనందాన్ని ఇస్తుందని, సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం కూడా అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. స్వామి రామానంద తీర్థ మెమోరియల్ స్కూల్‌కు అవసరమైన అదనపు తరగతి గదులు, ఆధునిక గ్రంథాలయ నిర్మాణానికి పూర్తి సహకారం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాసయాదవ్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, ట్రస్ట్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం కేటీఆర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

# 30న రైతు భరోసా నిధులు విడుదల

**హైదరాబాద్, అశ్వ అప్డేట్:**

ఈనెల 30వ తేదీన రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశమైంది. ఈ సమావేశంలో ఈ మేరకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. వరుసగా తొమ్మిది రోజుల పాటు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం ఈ నిధులను జమ చేయనుంది. 30న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు. రైతు భరోసా కింద రైతులకు ప్రభుత్వం ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని రెండు పంటల కాలాలకు ఖరీఫ్, రబీ కాలంలో విడగొట్టి, ప్రతి సీజన్‌కు ఎకరాకు రూ. 6,000 చొప్పున నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. మరోవైపు.. 23వ ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం సంబంధిత నిధులను కేంద్రం ఈ నెల 20న విడుదల చేయనుంది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 రోజుల తేడాతో రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి. సచివాలయంలో మంత్రులతో ప్రత్యేకంగా నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై సీఎం చర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలు, ధాన్యం కొనుగోళ్లు, వీబీజీ రాంజీ పథకం, కేంద్ర ప్రభుత్వ వైఖరి తదితర అంశాలపై మంత్రులతో చర్చలు జరిపారు. వానాకాలం రైతు భరోసా నిధులు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. జూన్ 30వ తేదీన మధిరలో రైతు సమ్మేళనం పేరిట నిర్వహించే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి రైతు భరోసా నిధులు విడుదల చేస్తారని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్ల సమావేశంలో వివరించారు. ఏడు రకాల సన్నాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మార్కెట్లో వాటికి ఉన్న డిమాండ్ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. మన రాష్ట్రం నుంచి కేంద్రం తక్కువ ధాన్యం సేకరించడంపై ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తమైందని పేర్కొన్నారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా కేంద్రాన్ని డిమాండ్ చేశామని తెలిపారు. కేంద్రం కనీస మద్దతు ధర ఇచ్చి కొనే ధాన్యాన్ని మాత్రమే తెలంగాణ కొనాలని నిర్ణయించామన్నారు. ఎరువుల కోటాను వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై పలుమార్లు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖలు రాశారని గుర్తు చేశారు. త్వరలో ఢిల్లీకి వెళ్లి ఆయా అంశాలను కేంద్రానికి విజ్ఞప్తి చేయాలని నిర్ణయించామన్నారు. రామగుండంలో తయారయ్యే యూరియాలో అత్యధిక శాతాన్ని తెలంగాణకే కేటాయించాలని కేంద్రానికి స్పష్టం చేశారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా సహకరించాలని కేంద్రాన్ని కోరారు. అందుకు మెట్రో రెండో దశకు అనుమతి ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఐఆరఎఫ్‌సీ నుంచి రావాల్సిన రుణాన్ని వెంటనే విడుదల చేయించాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తెలిపారు. రాష్ట□భివృద్ధికి అడ్డంకులు లేకుండా ప్రాజెక్టుల అనుమతులు ఇప్పించడానికి కలిసి రావాలని బీజేపీ ఎంపీలకు ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ పిలుపునిచ్చారు. ఇకపై డిజిటల్ క్యాబినెట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. జూన్ 21వ తేదీన జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఈ కేబినెట్ భేటీలో నిర్ణయించినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇక వీబీ` జీ ఆరఏఎం జీ పై కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ సబ్ కమిటీలో మంత్రులు సీతక్క, తుమ్మల, ఉత్తమ్ ఉంటారు. దీనిపై ఇతర రాష్టాల్లో□ అధ్యయనం తర్వాత.. జూన్ 25 లోపు ప్రభుత్వానికి కేబినెట్ సబ్ కమిటీ నివేదిక అందజేయనుందని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు.

# లక్షరూపాయల విలువైన 65ప్యాకెట్ల నకిలీ పత్తి విత్తనాలు సీజ్..

- **ఒకరిని అరెస్ట్ చేసిన నూతనకల్ పోలీసులు.**

**అశ్వ అప్డేట్**

నకిలీ పత్తి విత్తనాలను రైతులకు అంటగడుతున్న ఒకరిని అరెస్టు చేసి ఒక లక్ష రూపాయల విలువైన 65 ప్యాకెట్ల నకిలీ పత్తి విత్తనాలను సీజ్ చేసి కేసు నమోదు చేసిన నూతనకల్ పోలీసులు. ఈరోజున 18062026 తేదీన నమ్మదగిన సమాచారంపై నూతనకల్ పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారుల సమక్షంలో మండల పరిధి పెదనెమిల ఎక్స్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా గుండేపూడి గ్రామం, మరిపెడ మండలం, మహబూబాబాద్ జిల్లా నివాసి బోడపట్ల యాకస్వామి (32) అనే వ్యక్తిని TS265651 హీరో గ్లామర్ మోటార్ సైకిల్ పై అనుమానాస్పదంగా తరలిస్తున్న పత్తి విత్తనాలతో పట్టుకున్నారు. అతని వద్ద నుండి "అరుణోదయ" లేబుల్ కలిగిన 65 ప్యాకెట్ల పత్తి విత్తనాలు (ఒక్కోటి సుమారు 450 గ్రాములు) స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా విత్తనాల విక్రయానికి వినియోగించినట్లు భావిస్తున్న ఒక మొబైల్ ఫోన్ మరియు మోటార్ సైకిల్ మరియు ఒక టాటా ఏక్ వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న విత్తనాలను తదుపరి పరీక్షల నిమిత్తం సంబంధిత అధికారులకు అప్పగించగా, కేసు



నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారంలో సంబంధం ఉన్న నందిగామ కి చెందిన రాంబాబు అనే ఇతర వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు లకు పోలీసు నిఘా ఉంచినది.ఈ కేసునందు పని చేసిన సిబ్బందిని సూర్యాపేట ఎస్పి అభినందనలు తెలిపారు.



# పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, సీపీ....

**అశ్వ అప్డేట్**

మంచిర్యాల జోన్‌లో ఈ నెల 21న జరగనున్న నీట్ రీఎగ్జామినేషన్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం సీపీ అంబర్ కిషోర్ ఝా, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మంచిర్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను, ముఖ్యంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి, అభ్యర్థులకు కల్పిస్తున్న వసతులు, భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. పరీక్షను అత్యంత పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు పక్కా ప్రణాళికతో భద్రతా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు...




# సాయికృష్ణ ఘటనపై సీఎం సీరియస్.. ఉన్నతస్థాయి విచారణకు ఆదేశాలు

**అశ్వ అప్డేట్**

విజయవాడ కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న గాదె సాయికృష్ణ ఘటనను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత సీరియస్‌గా తీసుకుంది. ఈ ఘటనపై సమగ్రంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి వాస్తవాలను వెలికి తీయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. గాదె సాయికృష్ణను పోలీస్ లాకప్‌లో కొట్టి చంపారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో, ఈ కేసుపై ఉన్నతస్థాయి విచారణ నిర్వహించాలని ముఖ్యమంత్రి డీజీపీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాలను పరిశీలించి నిజానిజాలు తేల్చాలని సూచించారు.

ఈ అంశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సచివాలయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. దాదాపు గంటన్నర పాటు కొనసాగిన ఈ భేటీలో కృష్ణలంక పోలీస్ స్టేషన్ ఘటనతో పాటు రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై కూడా చర్చించినట్లు సమాచారం. సాయికృష్ణ ఘటనపై చర్చ సందర్భంగా డీజీపీ, విజయవాడ పోలీస్ కమిషనర్, ఇంటెలిజెన్స్ అదనపు డీజీతో పాటు ఇతర ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి తన కార్యాలయానికి పిలిపించి వివరణ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇప్పటికే కృష్ణలంక సీఐ నాగరాజును వీఆర్‌కు పంపిన విషయాన్ని డీజీపీ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిసింది.

అనంతరం ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి పూర్తి నివేదిక సమర్పించాలని డీజీపీని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రజల్లో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకంగా విచారణ నిర్వహించాలని సూచించినట్లు సమాచారం. సాయికృష్ణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో, ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. విచారణ అనంతరం వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

మొత్తంగా.. గాదె సాయి కృష్ణ విషయంలో కుటుంబ సభ్యులు లాకప్ డెత్ చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణలపై ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కృష్ణలంక సీఐ నాగరాజుపై సస్పెన్షన్ వేటు వేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.. సీనియర్ ఐపీఎస్ ఆధ్వర్యంలో ఈ ఘటనపై పూర్తిస్థాయి సమగ్ర విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. 9 బృందాలను ఈ కేసు కోసం ఏర్పాటు చేస్తున్నారు. గాదే సాయి కృష్ణను పోలీసులు తీసుకెళ్లి హింసించి లాకప్ డెత్ పోలీసులు చేశారని 38 రోజులుగా సాయికృష్ణ ఆచూకీ తెలియటం లేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ ఆందోళనలు చేస్తున్నారు.. ఈ ఘటనపై వైసీపీ నేతలు కూడా పోలీసులను కలిసి వినతిపత్రం ఇవ్వటంతో పాటు ఆందోళన కూడా నిర్వహించారు.. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు తాజా ఆదేశాలు ఇవ్వటంతో సాయి కృష్ణ వ్యవహారం కీలక మలుపు తీసుకున్నట్లుగా అయింది.. ఇవాళ ఉదయం కూడా సాయి కృష్ణ తల్లి విజయలక్ష్మి మేనమామ నాగేశ్వరరావు ఇతరులు ప్రెస్ మీట్ పెట్టి తమకు ఏ పార్టీతో సంబంధం లేదని ఎన్నికల్లో మాత్రం లోకేష్, పవన్ కోసం పనిచేశామని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ గతంలో తమకు న్యాయం చేయాలని బాధ్యత చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు..




# బిఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

**ఆశ్వ అప్డేట్స్ : చిట్యాల**

రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలపై, ఉద్యోగాల నోటిఫికేషన్ల విడుదలను డిమాండ్ చేస్తూ ఈరోజు బిఆర్ఎస్వీ పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి నివాస ముట్టడి కార్యక్రమం గురువారం నిర్వహించనున్నారు. ఈ ముట్టడి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు అరెస్టుల పర్వానికి తెరలేపారు. ఇందులో భాగంగా నల్గొండ జిల్లా చిట్యాల పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో టిఆర్ఎస్ నాయకులు ఆగు అశోక్, మరగోని రమేష్, నజీముద్దీన్, కూరెళ్ళ లింగస్వామి, పదో వార్డు కౌన్సిలర్, నిమ్మనగోటి శ్రీనివాస్, ఆవుల ఆనంద్, బొలుగూరి సైదులు తదితరులు ఉన్నారు..



# వర్షా ల నేపథ్యంలో వాటర్ లాగింగ్ ప్రాంతాల పరిశీలన చేసిన సీపీ సజ్జనార్

**హైదరాబాద్, జూన్ 18, అశ్వ అప్డేట్**

నగరంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో సోమాజిగూడలోని జీఆర్టీ జంక్షన్, ప్రజాభవన్ పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన నీటి నిల్వలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ గురువారం రాత్రి స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా జాయింట్ సీపీ (ట్రాఫిక్) జోయల్ డేవిస్, డీసీపీ అవినాష్ కుమార్ తదితర పోలీస్ ఉన్నతాధికారులు ఆయన వెంట ఉన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించిన సీపీ, జీహెచ్ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకుని రోడ్డుపై నిలిచిన నీటిని త్వరితగతిన తొలగించాలని ఆదేశించారు.

వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండ అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించిన ఆయన, వర్షం తగ్గి రహదారులపై నీటి నిల్వలు పూర్తిగా తొలగే వరకు ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ప్రయాణికులకు అవసరమైన సహాయం అందిస్తూ ట్రాఫిక్‌ను సజావుగా నిర్వహించాలని అధికారులకు సీపీ సజ్జనార్ ఆదేశించారు. నగర ప్రజలు కూడా వర్షాల సమయంలో జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు.



# మొహరం పండుగను శాంతియుతంగా నిర్వహించూకోవాలి:టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు

**అశ్వ అప్డేట్:**
**నారాయణపేట అర్జున్ 18**

మొహరం పండుగ సందర్భంగా జిల్లా కేంద్రలోని బీబీ దర్గా, మక్కా మసీదు పీర్ల చావడీల వద్ద బందోబస్తు ఏర్పాట్లను టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు. పీర్లను ఏర్పాటు చేస్తున్న ఆర్గనైజర్లు, కమిటీ సభ్యులకు భద్రతా పరమైన సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మొహరం పండుగను భక్తిశ్రద్ధలతో పాటు శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. పీర్ల ఊరేగింపులు, మతపరమైన కార్యక్రమాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని అలాగే నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

ప్రజలు, యువకులు ఎలాంటి వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని తెలిపారు.

పండుగ సమయంలో మద్యం సేవించి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమన్నారు.

అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల సహకారంతో మొహరం పండుగను విజయవంతంగా నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, పీర్ల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కేటీఆర్ ఓ వీకెండ్ ఎమ్మెల్యే

**తంగళ్లపల్లి, అశ్వ అప్డేట్:**

కేటీఆర్ ఓ వీకెండ్ ఎమ్మెల్యే అని, ఆయనకు ప్రజల గురించి మాట్లాడే తీరిక కూడా లేదని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. గురువారం రాత్రి సిరిసిల్లలో పర్యటించిన కవిత, స్థానిక చౌరస్తాలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి భాయి పూలే విగ్రహాలకు పూల మాలలు వేసిన అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ సిరిసిల్లలో సెస్ అనే సంస్థ ఉండేదని, దానిని ప్రభుత్వంలో విలీనం చేసినా సరే కేటీఆర్ ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. రైతుల కోసం ప్రభుత్వం డిస్కం ఏర్పాటు చేస్తామంటే కూడా నిలదీయలేదని ఫైర్ అయ్యారు. అంటే రైతు డిస్కం కావాలని మీరు భావిస్తున్నారా..? అని నిలదీశారు. సిరిసిల్ల నియోజకవర్గానికి కాళేశ్వరం నుంచి కేవలం 480 ఎకరాలకు మాత్రమే నీళ్లు వస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి తర్వాత ముఖ్యమంత్రి అని చెప్పుకునే మీ ఎమ్మెల్యే నీళ్లు ఎందుకు తేలేదని నిలదీశారు.

వేములవాడలో ఇంకా 77 వేల ఎకరాలకు కాళేశ్వరం నుంచి నీళ్లు రావాల్సి ఉందన్నారు. వర్కర్ టు ఓనర్ పథకం ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. సిరిసిల్లలో కార్మికులు ఉంటే వేములవాడలో యారన్ డిపో పెట్టి రాజకీయం చేస్తున్నారన్నారు. తమ అక్రమ సంపాదన కోసం నేరేళ్లలో దళితులు, బీసీలను ఘోరంగా కొట్టారని విమర్శలు చేశారు. 9 ఏళ్లు అయిన సరే, ఆ బిడ్డలకు న్యాయం జరగలేదని, ఇటీవలే వాళ్లు మమ్మల్ని కలిశారన్నారు. రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కూడా వాళ్లను ఆదుకుంటామని చెప్పి పైసా సాయం చేయలేదని మండిపడ్డారు. మేము అధికారంలోకి వస్తే యువతకు స్వయం ఉపాధి లాంటి గ్రూప్స్ ఏర్పాటు చేసి, వాళ్లకు 2 నుంచి 20 కోట్ల వరకు రుణాలు ఇస్తామన్నారు.







# మల్లేమోనిగూడలో ముమ్మర 'కమ్యూనిటీ కాంటాక్ట్' ప్రోగ్రాం

- **భారీగా వాహనాలు, మద్యం సీజ్**

**అశ్వ అప్డేట్**

వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, IPS గారి ఆదేశాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పరిగి డివిజన్ పరిధిలో పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు.

ఇందులో భాగంగా నేడు తెల్లవారుజామున 05:00 గంటల నుండి పరిగి మండలం మల్లేమోనిగూడ గ్రామంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్ గారి ప్రత్యక్ష పర్యవేక్షణలో భారీ 'కమ్యూనిటీ కాంటాక్ట్' (కార్డన్ అండ్ సెర్చ్) ఆపరేషన్ నిర్వహించారు. దాదాపు 160 మంది అన్ని రకాల ర్యాంకుల పోలీస్ అధికారుల బలగంతో ఈ తనిఖీలు ముమ్మరంగా సాగాయి. గ్రామంలోని ప్రతి ఇల్లాన్ని, అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా సోదా చేశారు.

ఈ విస్తృత తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని 45 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, 1 కారుతో పాటు నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 39 లీటర్ల అక్రమ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 31 చలాన్లు నమోదు చేసి, రూ. 12,245/ జరిమానా విధించారు. అనుమానస్పదంగా ఉన్నటువంటి వ్యక్తులను పాప్ లాన్ డివైస్ ద్వారా తనిఖీ లు చెయ్యడం జరిగింది. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకే ఈ ముందస్తు తనిఖీలు చేపట్టినట్లు డీఎస్పీ శ్రీనివాస్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

కేవలం తనిఖీలకే పరిమితం కాకుండా, ఈ సందర్భంగా పోలీస్ అధికారులు గ్రామ ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై వివిధ సామాజిక అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలలో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత కాలంలో యువతను పట్టి పీడిస్తున్న సైబర్ నేరాలు, డ్రగ్స్ మహమ్మారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. బాల్య వివాహాల నిర్మూలన, పోక్సో చట్టం, మహిళల భద్రత, ఆస్తిపాస్తుల రక్షణ మరియు రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన రహదారి భద్రత నియమాలపై ప్రజలకు, యువతకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు.

ఇట్టి కార్యక్రమం లో పరిగి CI కొండల్ రెడ్డి, కొడంగల్ CI శ్రీధర్ రెడ్డి, పరిగి సబ్ డివిజన్ ఎస్.ఐ లు, సిబ్బంది, QRT సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.






**అశ్వి అప్డేట్**

రాష్ట్ర మంత్రిమండలి సమావేశాలను పేపర్ లెస్ విధానంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మంత్రివర్గ సమావేశాలను తెలంగాణ డిజిటల్ కేబినేట్‌గా నిర్వహించడానికి వీలుగా పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు సమావేశంలో ముఖ్యమంత్రి గారికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారితో పాటు మంత్రులందరికి ప్రత్యేకంగా ట్యాబ్‌లను అందజేశారు.
మంత్రిమండలి సమావేశాల నిర్వహణకు సంబంధించిన డిజిటల్ విధానాన్ని ట్యాబ్‌ల ద్వారా సమావేశంలో ప్రదర్శించి పరిశీలించారు. ఇక నుంచి ఈబుక్ ద్వారానే మంత్రి మండలి సమావేశం ఎజెండా, సంబంధిత నోట్స్ అన్నీ కూడా మంత్రులకు అందుబాటులో ఉంచనున్నారు.

# ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలి - జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ, ఓటర్ల జాబితా ప్రక్షాళన విజయవంతం అయ్యేలా సహకరించాలని కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు. గురువారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై(సర్) సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులకు రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. బూత్ లెవెల్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులకు క్షేత్రస్థాయి సన్నాహక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. జూన్ 25 జులై 24వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటికీ తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలను సేకరిస్తారని, 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ఇందులో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. జులై 24 30వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతారన్నారు. ఓటర్ల ముసాయిదా జులై 31న జాబితా ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారని అన్నారు. ఎవరైనా తప్పు సమాచారం ఇస్తే నేరుగా పేరు తొలగించకుండా, ముసాయిదా జాబితా తర్వాత నోటీసు ఇచ్చి, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. వలస వెళ్లిన వారు, మరణించిన వారు, మరియు డూప్లికేట్ ఓటర్లను గుర్తించి జాబితా నుండి తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 లోని సెక్షన్ 31 ప్రకారం, ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం లేదా తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ఒక సంవత్సరం జైలు శిక్ష, జరిమానా లేదా రెండు విధించే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుత జాబితాలో పేరు లేని కొత్త ఓటర్లు తప్పనిసరిగా ఫామ్6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అయిన 01102026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించారు. ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మారిన వారు ఫామ్8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, సాయి బాబా (ఐ. ఎన్.సి), యాద సత్యం.(బి.ఆర్.ఎస్).పి. రాజేందర్ రెడ్డి (బి జె.పి ), ఎం.డి.అబ్దుల్ హాది ,సాదతుల్ల,(ఎం. ఐ.ఎం),బి.డి.సామ్యూల్(వై. ఎస్.ఆర్.సి.పి),వై.నర్సింహులు,(బి.ఎస్.పి),ఎం. మురళి(టి. డి.పి) పాల్గొన్నారు.



# శ్రీ గోదాదేవి రంగనాథ స్వామి ఆలయంలో గవర్నర్, ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక పూజలు

**అశ్వి అప్డేట్**

మీర్‌పేట్ హౌసింగ్ బోర్డు డివిజన్ పరిధిలోని మంగపురంలోని శ్రీ గోదాదేవి రంగనాథ స్వామి దేవస్థానంలో నిర్వహించిన వికారి శ్వారి క్రతు జీవహోత్తవ ఆహ్వాన కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, నిర్వాహకులు అతిథులకు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ధార్మిక విలువలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి కార్యకర్తలను కలుపుకొని ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- **కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం న్ శివకుమార్ రెడ్డి**

**అశ్వి అప్డేట్: నారాయణపేట**

నారాయణపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడుగా కోట్ల రవీందర్ రెడ్డి పట్టణ అధ్యక్షుడిగా వెంకటేష్ గౌడ్ పదవి ల పదవి ప్రమాణ స్వీకారం సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి ప్రభుత్వం చేస్తున్న పథకాలను ప్రజల్లోకి చేరవేసే బాధ్యతను బుజాస్కందాలపై వేసుకొని ప్రజలకు వివరించాలని అన్నారు, అలాగే పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలని అలాంటి వారిని కలుపుకొని కాంగ్రెస్ పార్టీ దినదిన అభివృద్ధి కి కృషి చేయాలని వారిని సూచించారు, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు, కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి డైరెక్టర్ శరణప్ప, వ్యవసాయ మార్కెట్ మాజీ కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్ ఆర్టిఏ మెంబర్ పోషల్ రాజేష్ లతో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు వివిధ కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు

# పదవ తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థుల కు సన్మానం

**అశ్వి అప్డేట్: నారాయణపేట జూన్ 18**


నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో నీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో 500 పైగా మార్కులు సాధించడమే కాకుండా బాసర త్రిబుల్ ఐటీ లో సీట్లు సాధించిన విద్యార్థులను కోటకొండ కళాంజలి స్కూల్ ప్రిన్సిపాల్ భాస్కర్ ఉపాధ్యాయ బృందంతో విద్యార్థులకు చిరు సన్మానం చేయడం జరిగింది, ఆర్థిక సాయం 5000 2500,,1000 రూపాయల ఆర్థిక సహాయాన్ని కూడా ఇవ్వడం జరిగింది భవిష్యత్తులో ఇలాగే ఉన్నత చదువులు చదివి గ్రామానికి పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని అభినందించారు, ప్రభుత్వ ఉపాధ్యాయ బృందం, హెచ్ఎం సునీత, శ్రీనివాస్, కళాంజలి ఉపాధ్యాయులు వెంకటేష్, ఇతరులు పాల్గొన్నారు




# ఎం .పి .ఎల్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని తాహసిల్దార్‌కు వినతి

**ఆశ్వి అప్డేట్స్ : చిట్యాల**

చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని వట్టిమర్తి శివారులో గల ఎం .పి .ఎల్ పరిశ్రమ నుండి వస్తున్న భారీ కాలుష్యం, నల్లని పొగ, బూడిదపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ చిట్యాల తాహసిల్దార్ విజయ్ కుమార్‌కు బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎం. పి. ఎల్ పరిశ్రమ నుండి వెలువడుతున్న కాలుష్యం కారణంగా చిట్యాల మున్సిపాలిటీ మరియు వట్టిమర్తి పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాలి పూర్తిగా కాలుష్యం కావడం వల్ల చిన్న పిల్లలు, వృద్ధులు తీవ్రమైన శ్వాసకోశ ఇబ్బందులతో పాటు చర్మ వ్యాధుల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో ప్రజల ఆరోగ్యం మరింత ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, సదరు పరిశ్రమపై కఠిన చర్యలు చేపట్టాలి. చిట్యాల మున్సిపాలిటీ ప్రజలను కాలుష్య కోరల నుండి కాపాడి, వారి ఆరోగ్య భద్రతను పర్యవేక్షించాలి. పరిశ్రమ యాజమాన్యంపై అధికారులు తగిన చర్యలు తీసుకోని యెడల, బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు, ధర్నాలు, రాస్తారోకోలు చేపడతామని నాయకులు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ వినతిపత్రం సమర్పించిన వారిలో మున్సిపల్ సింగిల్ విండో వైస్ చైర్మన్ మెండె సైదులు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, 10వ వార్డు కౌన్సిలర్ నిమ్మలగోటి శ్రీనివాస్, 2వ వార్డు కౌన్సిలర్ ఎస్కే షబానా అజీముద్దీన్, 9వ వార్డు బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆగు అశోక్ యాదవ్, కునూరి శంకర్, ఉప్పలపల్లి నగేష్, జిట్ట కృష్ణ, మద్ది మధు, ఎస్కే జాంగిర్, సిల్వేరు యశ్వంత్, జిట్ట శేఖర్ మరియు ఇతర బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నేరేడు పండ్ల ఉపయోగాలు మరియు వాటిని తినేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు

**అశ్వి అప్డేట్**

ఖాళీ కడుపుతో నేరేడు పండ్లను తినకూడదు; తిన్న తర్వాత పాలు తాగడం కూడా మంచిది కాదు.నేరేడు పండ్లలో ఫైబర్ (పీచు పదార్థం) పుష్కలంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అమీబియాసిస్ మరియు జిగురు విరేచనాలతో బాధపడేవారికి ఈ పండ్లు తినడం మంచిది. కడుపులోని మలినాలను బయటకు పంపడానికి ఇవి తోడ్పడతాయి.3. రోగనిరోధక శక్తి పెంపువీటిలో విటమిన్‌సి, విటమిన్‌బి6, కాల్షియం, ఐరన్ మరియు పొటాషియం వంటి పోషకాలు మెండుగా ఉంటాయి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచి, ఇన్ఫెక్షన్ల నుండి రక్షిస్తాయి.4. ఇతర ప్రయోజనాలుబరువు తగ్గడం: వీటిలో కేలరీలు తక్కువగా ఉండి, ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల ఆకలిని నియంత్రించి బరువు తగ్గడానికి సహకరిస్తాయి.చర్మ ఆరోగ్యం: నేరేడులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మరియు విటమిన్‌సి చర్మాన్ని యవ్వనంగా, కాంతివంతంగా ఉంచడంలో సహాయపడతాయి.గుండె ఆరోగ్యం: రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

# ఓ వైపు వడగాలులు... మరోవైపు వర్షా లు..

**అశ్వి అప్డేట్**

తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుతం విచిత్ర వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఇటు తెలంగాణలో, అటు ఏపీలో ఒకే సమయంలో భిన్నమైన వాతావరణం కనిపిస్తోంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్ వంటి తెలంగాణ ప్రాంతాల్లో తీవ్రమైన వేడి మరియు వడగాలులు వీస్తుండగా, ఉష్ణోగ్రతలు ఏకంగా 40 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. దీనికి భిన్నంగా ఆంధ్ర ప్రదేశ్ లోని విజయవాడ, గుంటూరు, శ్రీకాకుళం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, నెల్లూరు వంటి తీరప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అయితే వడగాలులు, వర్షం ఒకేసారి ఎదురయ్యే వింత పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. ఈ విచిత్రమైన వాతావరణ మార్పులకు ఎల్ నినో ప్రభావం, రుతుపవనాల ముందస్తు వేగం, స్థానిక వాతావరణ వ్యత్యాసాలే ప్రధాన కారణాలని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ భిన్న పరిస్థితులు మరికొన్ని రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో తీవ్రమైన ఎండలు ఉన్న ప్రాంతాల్లోని ప్రజలు మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని హెచ్చరించారు. అలాగే భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో వరదలు రావడం, చెట్లు కూలిపోవడం, విద్యుత్ సరఫరా నిలిచిపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నందున స్థానిక ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.




# డాక్టర్ల కోఆర్డినేషన్ తోనే రోగి ప్రాణాలు కాపాడగలిగాం

- **యశోద మలక్ పేట్ హాస్పిటల్ డాక్టర్స్**

**అశ్వి అప్డేట్ నల్గొండ.**

అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే డాక్టర్ను సంప్రదించి తగిన చికిత్స చేసుకుంటే ప్రాణాప్రయం నుండి బయట పడవచ్చు అని , యశోద మలక్ పేట్ హాస్పిటల్ డాక్టర్లు వెంకటేష్ శ్రీపతి, ఐసీయు స్పెషలిస్ట్ కళాధన్, గుత్త శశిధర్ రెడ్డి అన్నారు. గురువారం నల్గొండలోని శాలిని హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నల్గొండ జిల్లా చిట్యాల గ్రామానికి చెందిన ఉయ్యాల నరసింహ అనే వ్యక్తికి గత పది రోజుల క్రితం కడుపులో నొప్పి రావడంతో, నల్గొండ ప్రాంతంలోని పలు హాస్పిటల్ తిరిగిన ఎటువంటి రిజల్ట్ రాకపోవడంతో, హైదరాబాదులోని మలక్ పేట్ యశోద హాస్పిటల్ లో చికిత్స నిమిత్తం రావడం జరిగిందని, పేషెంట్ ను,పరిశీలించిన డాక్టర్లు సమయస్ఫూర్తితో, నలుగురు డాక్టర్ల బృందంతో రోగికి అన్ని రకాల టెస్టులు నిర్వహించి, సమస్యను కనుక్కోవడం జరిగిందని, అత్యవసర పరిస్థితులలో కడుపులో పేగు వ్యాధి తీవ్రస్థాయిలో ఉండడంతో కిడ్నీ ఇన్ఫెక్షన్ దిశగా పేషంటు పరిస్థితి ఉండటంతో, అధ్యాధునిక శస్త్ర చికిత్సతో అతి తక్కువ ఖర్చులోనే పేషెంట్ కు ఆపరేషన్ చేసి, బ్రతికించడం జరిగిందని తెలిపారు. డాక్టర్ల కోఆర్డినేషన్ తోనే మలక్ పేట్ యశోద హాస్పిటల్ కు వచ్చిన పేషెంట్ల ప్రాణాలను నిలబెడుతూ, మంచి పేరు తెచ్చుకుంటున్నామని అన్నారు.
పేషెంట్లో గుర్తించిన సమస్యలు, సీకం భాగంలో పేగు చీలిక, సుమారు 150 మిల్లీలీటర్ల పుల్లతో కూడిన ఇన్ఫెక్షన్ ద్రవం, సీకప్ అసెంబ్డెంటిల్ కోలాస్ ట్రాన్స్ఫర్స్ పోలీన్ ప్రాంతాలలో బహుళ గాయాలు, చస్తల చికిత్స అనంతరం రోగికి ఐసీయూలో మల్టీ ప్లీనరీ క్రిటికల్ కేర్ బృందం పర్యవేక్షణలో చికిత్స నిర్వహణ, హిష్టపథాలజీ పరీక్షల్లో పలు అంశాలు, బయాప్సీ మరియు హిస్టోపథాలజీ పరీక్షలు తీవ్రమైన ట్రాన్స్ఫర్ సైక్రోసిస్ నేక్రో ఇంస్టాల్ మేటర్, పెరిటోనాటిస్, గుర్తించామని అన్నారు. చికిత్స అనంతరం రోగిలో ఇవన్నీ పూర్తిస్థాయిలో నియంత్రకు వచ్చాయని తద్వారా పేషంట్ ఆరోగ్యంగా మన ముందు ఉన్నారని తెలిపారు. మలక్ పేట్ యశోద హాస్పిటల్ అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఎటువంటి సమస్యలు వచ్చిన యశోద మల మలక్ పేట్ హాస్పిటల్ తక్కువ ఖర్చుతోనే వైద్య సదుపాయం లభిస్తుందని తెలిపారు.




# ఘనంగా ముగిసిన ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరం

**ఆశ్వి అప్డేట్స్: చిట్యాల**

నల్లగొండ జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో వెల్మకన్నె గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత వాలీబాల్ శిక్షణ శిబిరం అట్టహాసంగా ముగిసింది. మే 24 నుండి జూన్ 09 వరకు జరిగిన ఈ క్రీడా ప్రాంగణ ముగింపు కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. బి. రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి మహమ్మద్ అక్బర్ అలీ గారు మంజూరు చేసిన సర్టిఫికెట్లను, ప్రధానోపాధ్యాయులు ఆర్.బి. రాములు క్రీడాకారులకు చేతుల మీదుగా అందజేశారు.
ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ ఉచిత శిక్షణ శిబిరంలో నేర్చుకున్న వాలీబాల్ క్రీడా మెలకువలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. మండల, జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయి టోర్నమెంట్‌లలో ప్రతిభ కనబరిచి జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలవాలి. ప్రతిరోజూ వాలీబాల్ సాధన చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ఎంతో ఆరోగ్యంగా ఉంటారు" అని ఆయన పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరాన్ని అద్భుతంగా నిర్వహించి, విద్యార్థులకు చక్కని శిక్షణ ఇచ్చిన సహాయక కోచ్‌లు డొంకని శివ, అవుల నవీన్‌లను పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.
ఈ ముగింపు కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు ఎన్. లింగయ్య, ఏ. దేవదాసు, డి. వాచెస్ పతాచారి, బి. మల్లేష్, ఏ. సాంబయ్యలతో పాటు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు (పి.డి) కొండ పరమేష్ గారు పాల్గొని ప్రతిభ చాటిన క్రీడాకారులందరికీ తమ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.



# విద్యారంగంలో మార్పులు కావాలి!

తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభం ఒక గొప్ప ముందడుగనే చెప్పాలి. అందరికీ విద్య అన్నది ప్రభుత్వ పరంగా చేపట్టడం ఆహ్వానించదగ్గ విషయం. విద్య,వైద్యం విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటే ఓ ఐదేళ్లలో గణనీయమైన మార్పులు తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి వరకు ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం అందితే ప్రజలకు అంతకు మించి కావాల్సింది లేదు. కులాలు, మతాల వారీగా హాస్టళ్లు, స్కూళ్ల వల్ల సమాజంలో అసమనాతలు పెరిగాయి. ఇదే విషయాన్ని పదేపదే ప్రస్తావిస్తున్న సిఎం రేవంత్ ఓ మంచి అడుగు వేశారనే చెప్పాలి. అయితే ఇదొక్కటే సరిపోదు. రేవంత్ రెడ్డి పదవీ కాలంలో రెండున్నరేళ్లు పూర్తయ్యాయి. ఇంకా రెండేళ్ల పదవీకాలం మాత్రమే ఉంది. కనీసం ఉన్న స్కూళ్లనయినా బాగుచేసి, హాస్టళ్లను స్కూళ్లకు అనుసంధానం చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి. కెసిఆర్ హయాంలో కెజి టూ పిజి అని ప్రగల్భాలు పలికారు. కానీ దానిని ఏనాడు పట్టాలకు ఎక్కించలేక పోయారు. ఆనాడే చేసివుంటే పదేళ్లలతో తెలంగాణ విద్యావ్యవస్థ రూపురేఖలు మారి ఉండేవి. ఇప్పటికైనా కామన్ విద్యావిధానం తీసుకుని రావాలి. అందరికీ ఒకేచోట విద్యను తీసుకుని వస్తే ప్రైవేట్ స్కూళ్ల దోపిడీ కూడా తగ్గుంది. గ్రామాల్లో కూడా సామాన్య జనం నేటికీ అప్పులు చేసి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. దీనిని తక్షణం నిరోధించాలి. ఈ దోపిడీని అరికట్టాలి. స్కూళ్లను అభివృద్ధి చేయడం వల్ల సమాజంలో కులాల మధ్య అంతరాన్ని తొలగించడంతో పాటు, కుటుంబాల ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దవచ్చు. ప్రైవేట్ దోపిడీని అరికట్టవచ్చు. అలాగే ఏకీకృత విద్యకు కృషి చేయాలి. విద్యా వివక్షను రూపుమాపాలంటే కామన్ స్కూల్ విధానం వెంటనే అమలు చేయాల్సి ఉంది. తెలంగాణ పబ్లిక్ స్కూల్ కాన్సెప్ట్‌ను సిఎం తప్పనిసరిగా అమలు చేయగలిగితే అతిపెద్ద విజయం సాధించినట్లుగా చెప్పవచ్చు. అలా కాకుండా తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల పేరుతో ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు ప్రవేశపెట్టినా లాభం ఉండదు. ఎంతగా డబ్బులు ఖర్చు చేసినా అత్యధిక విద్యార్థులున్న ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించకుండా, ప్రభుత్వ బడులను సంస్కరించకుండా ముందుకు సాగితే సత్ఫలితాలు సాధించలేం. ప్రభుత్వ బడికి గతంలో ఉన్న ఇమేజ్ తీసుకుని రావాలంటే ప్రైవేటుకు దీటుగా ఉన్నాయన్న భరోసా కల్పించాలి. అందుకు గట్టి కృషి చేయాలి. నాణ్యమైన ఉచిత విద్య ప్రభుత్వ బడిలో దొరుకుతుందనే గట్టి నమ్మకం మాత్రమే ప్రభుత్వ విద్యా సంస్థలలో నమోదు పెంచుతుంది. కాబట్టి పాలకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే గ్రామాల వారీగా ఏకీకృత కామన్ పాఠశాల వ్యవస్థకు రూపకల్పన చేయాలి. అంతేగాక ఇబ్బడి ముబ్బడిగా కనీస వసతులు లేకుండా నడుస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలను నిషేధించాలి. లేదా నియంత్రణ చర్యలు చేపట్టాలి. ఇలా చేయగలిగితే సిఎం రేవంత్ ర ఎడ్డి ఆశించిన ఫలితాలు వస్తాయి. అంతరాలు లేని శాస్త్రీయ విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది. కామన్ స్కూల్ విధానం మాత్రమే ప్రజలకు ఏకైక విద్యా ప్రత్యామ్నాయంగా గుర్తించి ముందుకు సాగేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ విధానం దోహదపడుతుంది. గ్రామాల్లో నర్సరీ నుంచి ఇంటర్ వరకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఒకే స్కూల్ ప్రజలకు అందుబాటులోకి తీసుకుని రావాలి. తెలుగు మీడియం అయినా ఆంగ్లబోధనను కూడా తప్పనిసరి చేయాలి. స్పోకెన్ ఇంగ్లీష్‌తో దీన్ని అధిగమించవచ్చు. ఇప్పుడు విద్యారంగానికి ఖర్చు చేస్తున్న నిధులతోనే ఏకీకృత విద్యను అందుబాటులోకి తీసుకుని రావచ్చు. గ్రామస్థాయి నుంచి పట్టణస్థాయి వరకు అందరి పిల్లలు ఒకే పాఠశాలలో చదువుకునే ఏకీకృత విధానం అమలు కావాలి. అక్కడే విద్యార్థులు బ్రేక్ ఫాస్ట్ మొదలు, మధ్యాహ్న భోజనం అందించాలి. ఇంటి నుంచి పిల్లలు స్కూలుకు వచ్చేలా అవసరమైతే ట్రాన్స్‌పోర్టు కూడా ఏర్పాటు చేయాలి. ఇది కుల, మత వైషమ్యాలు లేని విద్యా వ్యవస్థకు పునాది వేయగలదు. ఒక మండల కేంద్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ లాంటి స్కూల్ ఉంటే ఆ చుట్టుపక్కల విద్యార్థులంతా స్కూల్ బస్సుల్లో వచ్చి పోయేలా సౌకర్యాలు కల్పించాలి. దీనివల్ల పిల్లలు తల్లిదండ్రుల సమక్షంలోనే పెరగగలరు. హాస్టళ్లలో పడి బాల్యం కోల్పోకుండా చూడగలం. తల్లిదండ్రుల అజమాయిషీలో వారికి ఖర్చు లేకుండా అంతా ప్రభుత్వ కనుసన్నల్లో విద్యను నేర్చుకోగలరు. ఇలా కిలోమీటరు నుంచి ఐదు కిలోమీటలర్ పరిధి వరకు పిల్లలకు స్కూలును అందుబాటులోకి తీసుకుని రావడం ద్వారా సంక్షేమ హాస్టళ్ల బాధ తప్పుతుంది. ఇకపోతే ప్రత్యేక అవసరాలు గల మూగ, బధిర, అంధ బాలలకు మాత్రం ప్రత్యేకంగా పాఠశాలలను ఏర్పాటు చేసి, దానికి అనుబంధంగా మాత్రం హాస్టళ్లను కొనసాగించాలి. మానసిక ఎదుగుదల లేని పిల్లలు ప్రత్యేక అవసరాలు గల పిల్లలుగా గుర్తించినా, వారిని తల్లిదండ్రుల ప్రత్యేక పర్యవేక్షణ కిందనే ఉంచి, పాఠశాలల వసతులను కల్పించాలి. అభివృద్ధి చెందిన అమెరికా, బ్రిటన్ లాంటి దేశాల్లో సైతం ఏకీకృత పాఠశాల వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే విస్తృతంగా అభివృద్ధి చెందింది. మన దేశంలో నియంత్రణ, నియమాలు లేకుండా విచ్చలవిడిగా ప్రైవేటు పాఠశాల వ్యవస్థను అనుమతించడం వల్ల విద్యావ్యవస్థ వెర్రితలలు వేసింది. అవసరాలకు మించి ప్రైవేటు పాఠశాలల ఏర్పాటుతో ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ దెబ్బ తింటోంది. తెలంగాణలో ఇప్పటికే నాలుగు వేల పాఠశాలలు మూతపడ్డాయని అంటున్నారు. 19లక్షల విద్యార్థులు ప్రభుత్వ విద్యాలయాల్లో చదువుతుంటే, 36లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు విద్యా సంస్థలలో చదువుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. మనకు ఇంగ్లీష్ లేనిదే ముద్ద దిగదు. సామాన్యులు కూడా తమ పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడాలని అనుకుంటారు. అందుకు ప్రభుత్వ స్కూళ్లలో స్పోకెన్ ఇంగ్లీష్ తప్పనిసరి చేయాలి. ఎల్‌కెజి నుంచే అది మొదలు కావాలి. మీడియం తెలుగు అయినా స్పోకెన్ ఇంగ్లీష్ ఉంటే పిల్లలు కూడా పెద్దయ్యాక బెరకు లేకుండా దూసుకు పోగలరు. ఇవన్నీ గమనించి విద్యారంగాన్ని పటిష్టం చేసే చర్యలకు అడుగులు వేస్తే విద్యారంగంలో విప్లవం సాధించగలం.

**డాక్టర్ కంచర్ల అచ్యుత రావు**



# ఆధార్‌ను ఐడెంటిటీకే పరిమితం చేయాలి

**పౌరసత్వం, నివాస ధ్రువీకరణ తదితరాలకు వాడొద్దు**

**పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ**




**న్యూఢిల్లీ, జూన్ 18:** ఆధార్ కార్డు వినియోగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది ఆధార్ కార్డులను పౌరసత్వం, నివాసం, అడ్రస్ ధ్రువీకరణకు ప్రూఫ్‌గా వాడుతున్నారని, ఇది కేవలం ఐడెంటిటీ వెరిఫికేషన్‌కు మాత్రమే పరిమితం చేయాలని దాఖలైన పిటిషన్‌ను విచారణకు చేపట్టిన సుప్రీంకోర్టు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటను స్పందించాలని సుప్రీంకోర్టు కోరింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసం, న్యాయవాది అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్ పిటిషన్ ను విచారించింది. ఈ పిటిషన్ పై కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలకు నోటీసులు జారీ చేసింది. ఆధార్‌ను ఐడెంటిటీ ప్రూఫ్ గా మాత్రమే వాడాలని పౌరసత్వం, నివాసం, అడ్రస్, పుట్టిన తేదీకి సంబంధించిన రుజువుగా వినియోగించకుండా కేంద్ర, రాష్ట్ర, ఎన్నికల సంఘాలకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు పిటిషనర్ అశ్వినీ కుమార్ ఉపాధ్యాయ్. ఓటరు నమోదుకు బర్త్ డేట్, రెసిడెంట్ ప్రూఫ్ లకు ఆధార్ కార్టును వినియోగిస్తున్నారని, ఇది ఆధార చట్టానికి విరుద్ధమని పిటిషనర్ వాదించారు. ఆధార్ చట్టం, 2016లోని సెక్షన్ 9 'ఆధార్ పౌరసత్వానికి లేదా రెసిడెంట్ కు ప్రూఫ్ కాదని స్పష్టంగా తెలిపింది ఉడాయ్. అయినప్పటికీ, ఆధార్‌ను స్కూల్ అడ్మిషన్లు,ప్రాపర్టీ కొనుగోలు, బర్త్ ప్రూఫ్ రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ పొందడం కోసం వయస్సు, పౌరసత్వం, నివాస ధృవీకరణ పత్రంగా ఉపయోగించడమే కాకుండా, కొత్త ఓటరు నమోదుకు, పుట్టిన తేదీకి, నివాస ధృవీకరణ పత్రంగా కూడా వాడుతున్నారు. ఈ విధంగా, చొరబాటుదారులు, అక్రమ వలసదారులు ఆధార్‌ను ఉపయోగించి వివిధ డాక్యుమెంట్లను పొందుతున్నారని పిటిషన్‌లో కోర్టుకు తెలిపారు. ఎన్నికల పక్రియలలో ధృవీకరణ వ్యవస్థను సమగ్రంగా ప్రక్షాళన చేయాలని, సంస్కరణలను పర్యవేక్షించేందుకు విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తితో పాటు సైబర్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఉన్నత స్థాయి పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేయాలని పిటిషన్‌లో కోరారు.

# 'డార్క్ వెబ్'గా టెలిగ్రామ్




- కేంద్రం సంచలన ఆరోపణలు
- సైబర్ నేరాలు, పేపర్ లీకులు, ఉగ్ర ప్రచారానికి వేదికగా మారిందని ఆరోపణ
- ఢిల్లీ హైకోర్టులో కేంద్రం అఫిడవిట్

**న్యూఢిల్లీ, జూన్ 18:** ప్రముఖ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్ చట్టవిరుద్ధ కార్యకలాపాలు, సైబర్ నేరాలకు ప్రధాన వేదికగా మారిందని కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ప్రస్తుత పరిస్థితుల్లో టెలిగ్రామ్ ఒక కొత్త 'డార్క్ వెబ్'లా రూపాంతరం చెందిందని, నేరస్థులు, సైబర్ మోసగాళ్లు, ఉగ్రవాద సంస్థలు దీనిని విస్తృతంగా వినియోగిస్తున్నాయని అఫిడవిట్‌లో పేర్కొంది. నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ, వాటి పంపిణీకి టెలిగ్రామ్ ఛానళ్లు వేదికగా మారాయని కేంద్రం ఆరోపించింది. దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని తెలిపింది. టెలిగ్రామ్ ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలపై ఫిర్యాదులు భారీగా పెరిగాయని, హ్యాకర్లు దొంగిలించిన డేటా విక్రయాలు, మనీ లాండరింగ్ కార్యకలాపాలకు కూడా ఈ వేదికను వినియోగిస్తున్నారని పేర్కొంది. చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్ వ్యాప్తి చెందడం భద్రతా సంస్థలకు తీవ్ర సవాలుగా మారిందని వెల్లడించింది. ఉగ్రవాద సంస్థలు తమ భావజాల ప్రచారం, తప్పుడు సమాచార వ్యాప్తికి టెలిగ్రామ్ గ్రూపులను ఉపయోగిస్తున్నాయని కేంద్రం తెలిపింది. అలాగే మాల్వేర్ పంపిణీ, సైబర్ దాడుల నిర్వహణకు కమాండ్ అండ్ కంట్రోల్ ప్లాట్‌ఫామ్‌గా కూడా టెలిగ్రామ్‌ను వినియోగిస్తున్నట్లు పేర్కొంది. పౌరుల మొబైల్ నంబర్లు, గుర్తింపు పత్రాల వివరాలు వంటి వ్యక్తిగత సమాచారాన్ని యాక్సెస్ చేసే బోట్లు కూడా టెలిగ్రామ్‌లో పనిచేస్తున్నాయని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కొత్త సినిమాలు, వెబ్‌సిరీస్‌లు తదితర కాపీరైట్ కంటెంట్‌ను అక్రమంగా పంపిణీ చేయడం వల్ల సృష్టికర్తలకు భారీ నష్టం జరుగుతోందని కేంద్రం వివరించింది. టెలిగ్రామ్‌లోని అధిక ప్రైవసీ, అనామక ఫీచర్లు నేరగాళ్లకు రక్షణ కవచాలుగా మారాయని కేంద్రం పేర్కొంది. వినియోగదారులు తమ ఫోన్ నంబర్లు, ఐడీలను దాచుకునే అవకాశం ఉండటంతో నేరాల వెనుక ఉన్న అసలు వ్యక్తులను గుర్తించడం దర్యాప్తు సంస్థలకు క్లిష్టంగా మారుతోందని హైకోర్టుకు వివరించింది.



# హర్మ్యూజ్ తెరుచుకున్నా ఇంధన ధరలు తగ్గవు

**ఇప్పట్లో తగ్గించే ఉద్దేశం లేదన్న కేంద్రం**

**న్యూఢిల్లీ, జూన్ 18:** అమెరికా– ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందంతో పశ్చిమాసియా సంక్షోభానికి తెరపడింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు దిగిరానున్నాయి. అయితే, ముడి చమురు ధరలు తగ్గినా.. భారత్‌లో వెంటనే ఇంధన ధరలను మాత్రం తగ్గించలేమని కేంద్రం తాజాగా స్పష్టం చేసింది. పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ ఇటీవల ఇంధన ధరలు పెంచడంపై గురువారం మాట్లాడారు. లీటరుకు దాదాపు రూ.3.94 మాత్రమే పెంచామన్నారు. అయితే, అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినంత మాత్రాన.. ఆ పెంపును వెంటనే తగ్గించలేమన్నారు. హర్మ్యాజ్ జలసంధి తెరుచుకున్నప్పటికీ.. ప్రస్తుతం అక్కడ నౌకల రాకపోకల రద్దీ ఎక్కువగా ఉంటుందన్నారు. దీంతో తక్కువ ధరకు లభించే ముడి చమురు భారత్‌కు వచ్చేందుకు ఇంకా సమయం పడుతుందని తెలిపారు. ఇలా పలు అంశాల వల్ల ఇంధన ధరలను వెంటనే తగ్గించలేమని స్పష్టంచేశారు. ఇక, పశ్చిమాసియా యుద్ధం మొదలైనప్పటి నుంచి దేశంలోని చమురు కంపెనీలు తీవ్రంగా ప్రభావితమయ్యాయన్నారు. ఆ సమయంలో ఇంధన ధరలపై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించేందుకు ఏ రాష్ట్రం ముందుకు రాలేదన్నారు. దీంతో ఆ భారమంతా కేంద్రంపై పడిందన్నారు. దీని కారణంగా కేంద్రం రూ.12వేల కోట్ల మేర ఆదాయం కోల్పోయిందన్నారు.

# టీఎంసీకి ఎదురుదెబ్బ

**రితబ్రత బెనర్జీ నియామకంపై స్టేకు నిరాకరణ**

**కోల్‌కతా, జూన్ 18:** తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ)కు కోల్‌కతా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా రితబ్రత బెనర్జీ నియామకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. జస్టిస్ కృష్ణారావు నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించి, తదుపరి విచారణ పూర్తయ్యే వరకు అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయం అమలులో కొనసాగుతుందని స్పష్టం చేసింది. దీంతో కేసు తుది తీర్పు వెలువడే వరకు రితబ్రత బెనర్జీ గుర్తింపు పొందిన ప్రతిపక్ష నాయకుడిగానే కొనసాగనున్నారు. ఈ కేసులో అఫిడవిట్ల మార్పిడిని త్వరగా పూర్తి చేయాలని ఇరు పక్షాలకు న్యాయస్థానం ఆదేశించింది. ప్రతివాదులు 3 వారాల్లోగా తమ వ్యతిరేక అఫిడవిట్‌ను దాఖలు చేయాలని, దానిపై పిటిషనర్లు రెండు వారాల్లో స్పందించాలని సూచించింది. తదుపరి విచారణను జులై 28కు వాయిదా వేసింది. కాగా, టీఎంసీ నుంచి బహిష్కరణకు గురైన రితబ్రత బెనర్జీ ఇటీవల పార్టీకి వ్యతిరేకంగా తిరుగుబాటు ఎమ్మెల్యేలకు నాయకత్వం వహిస్తున్నారు. తమకు 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేల మద్దతు ఉందని ప్రకటిస్తూ, అభిషేక్ బెనర్జీ నాయకత్వానికి వ్యతిరేకంగా ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేశారు. తిరుగుబాటు వర్గం వాదనను పరిగణనలోకి తీసుకున్న అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ రితబ్రత బెనర్జీని ప్రతిపక్ష నాయకుడిగా గుర్తించారు. అయితే, అధికారిక రాజకీయ పార్టీని పక్కనబెట్టి స్పీకర్ ఈ నిర్ణయం తీసుకున్నారని, ఇది రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధమని ఆరోపిస్తూ టీఎంసీ వర్గం హైకోర్టును ఆశ్రయించింది.

# ఇసుక వివాదం రక్తపాతం

**బీజేపీ నేత సహా ముగ్గురు సజీవ దహనం • ఛత్తీస్‌గఢ్‌లో సంచలనం.. నలుగురు అరెస్ట్**





రాయ్‌పూర్, జూన్ 18: ఛత్తీస్‌గఢ్‌లోని కోరియా జిల్లాలో ఇసుక మైనింగ్ వివాదం ఘోర హత్యాకాండకు దారితీసింది. బీజేపీ నేత, మాజీ జనపద్ పంచాయతీ అధ్యక్షుడు భరత్ సింగ్ (లల్లా సింగ్) సహా ముగ్గురు సజీవ దహనమైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటన సోన్‌హత్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నౌగైన్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, ఇసుక క్వారీ నిర్వహణకు సంబంధించిన వివాదాన్ని పరిష్కరించేందుకు చర్చల పేరుతో భరత్ సింగ్‌ను ప్రత్యర్థులు పిలిచారు. అక్కడికి చేరుకున్న అనంతరం ఆయన ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ కారును ట్రక్కులతో చుట్టుముట్టి కదలకుండా అడ్డుకున్నారు. అనంతరం కారుపై పెట్రోల్ పోసి నిప్పంటించడంతో భరత్ సింగ్ కారులోనే సజీవ దహనమయ్యారు. ఈ ఘటనలో భరత్ సింగ్ బంధువులు వీరేంద్ర సింగ్, నాగేంద్ర సింగ్‌లు కూడా తీవ్రంగా గాయపడ్డారు. వారిలో వీరేంద్ర సింగ్ చికిత్స పొందుతూ మృతి చెందగా, మరో బంధువు మయాంక్ సింగ్ బిలాస్‌పూర్‌లోని ఆసుపత్రిలో విషమ పరిస్థితిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికంగా ఇసుక మైనింగ్ వ్యాపారంలో ప్రభావం కలిగిన భరత్ సింగ్ కుటుంబానికి ఆ ప్రాంత ఇసుక క్వారీ కాంట్రాక్టు దక్కింది. అనంతరం ఇసుక తవ్వకాలు, రవాణా, వసూళ్ల విషయంలో భరత్ సింగ్ వర్గానికి, మనోజ్ త్రిపాఠి కుటుంబానికి మధ్య నెలలుగా ఆధిపత్య పోరు కొనసాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విభేదాలే చివరకు హింసాత్మక ఘటనకు దారితీసినట్లు భావిస్తున్నారు. ఈ దాడి ముందస్తు ప్రణాళికతో జరిగిన హత్యేనని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ, కేసును సీబీఐతో విచారించాలని డిమాండ్ చేశారు. ఘటన అనంతరం కోరియా జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఈ కేసులో అక్షత్ త్రిపాఠి, విశాల్ త్రిపాఠి, సత్యప్రకాశ్ త్రిపాఠి, మన్ను త్రిపాఠి అనే నలుగురు ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం తొమ్మిది మందిపై హత్య, హత్యాయత్నం తదితర తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఘటనపై సమగ్ర విచారణ కొనసాగుతోందని అదనపు ఎస్పీ సురేషా చౌబే తెలిపారు.



# గురక సమస్య సతాయిస్తోందా.... ఇలా ట్రై చేయండి..

గురక.. ఇది మన కన్నా మన పక్కన ఉండే వారికి పెద్ద సమస్యలా ఉంటుంది. వారు నిద్ర లేక చాలా సతమవుతుంటారు. పక్క వారి తలనొప్పిలా మారినందుకు ప్రతిరోజూ మనం కూడా చాలా షేమ్‌గా ఫీలవుతుంటాం.ఈ సమస్య నుంచి బయటపడాలని ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండకుండా పోతుంది. అయితే గురక సమస్యకు అనేక కారణాలు ఉంటాయని వైద్యులు చెప్తున్నారు. అదే విధంగా గురక సమస్య నుంచి బయటపడటానికి కొన్ని చిట్కాలు పాటిస్తే సరిపోతుందని, ఈ సమస్య సమసిపోతుందని వైద్యులు వివరిస్తున్నారు. ప్రారంభ దశలో గురక సమస్యకు ఊబకాయం, ముక్కు, గొంతు కండరాలు బలహీనపడటం, జలుబు, ధూమపానం, శ్వాస సమస్యలు, ఊపిరితిత్తులలో సరైన స్థాయిల్లో ఆక్సిజన్ లేకపోవడం, సైనస్ సమస్యలు వంటికి కారణమవుతుంటాయి.ఈ గురక సమస్య బాధితుల నిద్రకు ఎటువంటి అంతరాయం కలిగించకపోయినప్పటికీ పక్క వారికి మాత్రం నిద్ర లేకుండా చేస్తుంటుంది. దీని వల్ల మనకేమో కానీ పక్కన ఉండేవారికి నిద్రలేమి సమస్యలు వచ్చే ప్రమాదం పెరుగుతుందని వైద్యులు అంటున్నారు. అయితే కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా గురక సమస్య నుంచి బయటపడొచ్చని వైద్యులు అంటున్నారు. కాగా.. గురక సమస్యకు ఎంత త్వరగా వైద్యం ప్రారంభించుకుంటే అంత త్వరగా సమసిపోతుందని, బాగా ముదిరిపోయిన తర్వాత చిట్కాలను వాడటం, వైద్యులను సంప్రదించడం చేసినా.. అంతే ఆలస్యంగా సమస్య తగ్గుతుందని అంటున్నారు నిపుణులు. మరి ఇంతకీ ఆ చిట్కాలు ఏంటో తెలుసుకుందాం..

**దాల్చిన చెక్క:**
గోరువెచ్చని నీరు ఒక గ్లాసుడు తీసుకోవాలి. అందులో దాల్చిన చెక్క పొడిని ఒకటి రెండు చెంచాలు వేసి బాగా కలుపుకోవాలి. ఆ నీటిని చిన్నగా తాగాలి. ఇలా తరచూ చేస్తూ ఉండటం ద్వారా గురక సమస్య నుంచి ఉపశమనం పొందొచ్చని నిపుణులు అంటున్నారు.





**వెల్లుల్లి:**
చిన్నుల్లిపాయలతో కూడా గురక సమస్య నుంచి బటయపడొచ్చని వైద్యులు అంటున్నారు. ప్రతి రోజూ పడుకునే ముందు ఒక వెల్లుల్లి రెబ్బను గోరువెచ్చని నీటితో తీసుకోవాలి. ఇలా చేయడం ద్వారా గురక సమస్య సమసిపోతుందని వైద్యులు వివరిస్తున్నారు.

**పుదీనా:**
నాలుగైదు పుదినా ఆకులు తీసుకోవాలి. వాటిని ఒక గ్లాసుడు నీళ్లలో వేసి ఆ నీటిని బాగా మరిగించాలి. సగం మేరా నీరు ఆవిరైన తర్వాత.. ఆ నీటిని గ్లాసులో పోసుకుని గోరువెచ్చగా ఉన్న సమయంలో తాగేయాలి. ఇతా ప్రతి రోజూ చేయడం ద్వారా గురక సమస్య తగ్గుతుంది.





**ఆలివ్ ఆయిల్:**
శ్వాస సంబంధిత కారణాల వల్ల గురక వచ్చే వారికి ఆలివ్ ఆయిల్ దివ్యౌషధంలా పనిచేస్తుంది. ఆలివ్ ఆయిల్‌తో ముక్కును మర్దన చేయడం ద్వారా.. శ్వాస సంబంధిత సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అందులో భాగంగానే గురక సమస్య కూడా సమసతిపోతుందని వైద్యులు అంటున్నారు. అదే విధంగా ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఒక్కో ముక్కులో రెండు నుంచి నాలుగు చుక్కల ఆలివ్ ఆయిల్‌ను వేసుకోవాలి. ఇలా చేయడం వల్ల కూడా గురక సమస్య క్రమంగా మాయమవుతుంది.

**నెయ్యి:**
గురక సమస్యకు దేశీ నెయ్యి వాడటం కూడా అద్భుత ఫలితాలను కనబరుస్తుంది. ఇందుకోసం దేశీ నెయ్యిని కొద్దిగా వేడి చేసుకోవాలి. అది చల్లారిన తర్వాత ఆ నెచ్చిని ముక్కులో వేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా గురక సమస్య దూరమవుతుందని నిపుణులు వివరిస్తున్నారు.





**పసుపు:**
పసుపు అనేక వ్యాధుల నుంచి మనల్ని కాపాడుతుంది. మన రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా ఇది కీలకంగా పనిచేస్తుంది. యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు అధికంగా ఉన్న పసుపుతో గురక సమస్యను కూడా దూరం చేయొచ్చని వైద్యులు అంటున్నారు. ప్రతి రోజూ పడుకునే ముందు వేడి పాలలో ఒక చెంచా పసుపును కలుపుకుని తాగాలి. పాలు లేకపోతే.. గోరువెచ్చని నీటిలో అయినా పసుపు వేసుకుని తాగడం ద్వారా గురక సమస్యను తగ్గించుకోవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ చిట్కాలు పాటించినా గురక సమస్య తగ్గకపోతే.. వైద్యులను సంప్రదించడం మంచాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అదే విధంగా గురకే కదా అని తేలికగా తీసుకోవద్దని, ఈ సమస్య పెరిగితే అనేక ఇతర సమస్యలకు కూడా దారి తీస్తుందని వైద్యులు సూచిస్తున్నారు.



# పొడవాటి జుట్టు కావాలంటే ఇవి చేయాల్సిందే..!



పొడవాటి జుట్టు కావాలన్నది ప్రతి అమ్మాయికి ఉండే కల. కొందరికి చిన్నప్పటి నుంచే వత్తైన పొడవాటి జుట్టు ఉంటే మరికొందరు దీని కోసం చేయని ప్రయత్నాలు ఉండవు. అనేక రకాల క్రీమ్‌లు, హెయిర్ ఆయిల్స్, బ్యూటీ ప్రొడక్ట్స్ వంటివి వాడుతుంటారు. కానీ ఫలితం ఉండదు. పైగా కొన్నికొన్ని సందర్భాల్లో జుట్టు పెరగడానికి పైగా.. రాలడం మొదలవుతుంది. అంతేకాకుండా జుట్టు ఉన్నదానికన్నా పల్చబడిపోయి.. చిట్లి పోయి.. అత్యంత దారుణంగా తయారవుతుంది. అయితే జుట్టు బాగా పెరగాలంటే రకరకాల ఖరీదైన బ్యూటీ ప్రొడక్ట్స్ వాడాల్సిన అవసరం లేదంటున్నారు వైద్యులు. అసలు జుట్టు రాలడానికి, అనారోగ్యంగా తయారవడానికి ప్రధాన కారణం దుమ్ము, ధూళి, పోషకాలు లేని ఆహారమేనని చెప్తున్నారు నిపుణులు. వీటిని సరిచేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జుట్టు పెరుగుతుందనేది వైద్యులు చెప్తున్నమాట. అంతేకాకుండా కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా పొడవైన జుట్టును పొందొచ్చని నిపుణులు అంటున్నారు. సాధారణంగానే బ్యూటీ ప్రొడక్ట్‌స్‌లో ఉండే రకరకాల కెమికల్స్ మంచి చేయాల్సింది పోగా చెడు చేసే అవకాశాలు ఉన్నాయని, ఏదైన కెమికల్ వికటిస్తే అనేక సమస్యలకు కారణమవుతుందని అంటున్నారు. కొన్ని హోం మేడ్ సీరమ్‌స్‌ను వాడటం ద్వారా వత్తైన, పొడవాటి జుట్టును పొందొచ్చట. మరి ఆ సీరమ్స్ ఏంటో ఒకసారి చూద్దామా..

**కావాల్సిన పదార్థాలు :**
కరివేపాకు, బ్లాక్ సీడ్స్, మెంతులు, కలబంద, ఉల్లిపాయ, ఆవనూనె

**తయారు చేసుకునే విధానం..**
ఒక పాత్ర తీసుకుని అందులో కరివేపాకు, బ్లాక్ సీడ్, కలబంద, మెంతులు, ఉల్లిపాయ ముక్కలు, ఒక కప్పు ఆవ నూనె వేసి స్టవ్ మీద పెట్టాలి. మంట తక్కువలో పెట్టి అరగంట పాటు మరిగించాలి. ఆ తర్వాత స్టవ్ అఫ్ చేసి నూనెను ఆరనివ్వాలి. ఆ నూనెను గాజు సీసాలోకి వడకట్టుకుని నిల్వ చేసుకోవాలి. ఈ హెయిర్ ఆయిల్‌ను జుట్టు కుదుళ్లకు పట్టేలా మర్దనా చేస్తూ పట్టించాలి. ఒక గంట తర్వాత సాధారణ షాంపూతో తలస్నానం చెసేయాలి. ఇలా ప్రతిరోజు చేస్తే మంచి ఫలితం ఉంటుంది. జుట్టు పొడవుగా పెరిగేందుకు ఈ ఆయిల్ అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో ఉపయోగించే పదార్థాలన్ని జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. వీటిలో ఉండే పోషకాలు జుట్టుతో పాటు ఆరోగ్యానికి కూడా చాలా మంచిది.

**కావాల్సిన పదార్థాలు:**
కొబ్బరి నూనె, ఉసిరికాయలు, కరివేపాకు, మెంతులు, అవిసెగింజలు, బ్లాక్ సీడ్స్, మందార పువ్వులు.

**తయారు చేసుకునే విధానం:**
కొబ్బరి నూనెను ఒక పాత్రలో వేసుకుని స్టవ్ పెట్టి వేడి చేయాలి. అందులో ఫ్లాక్ సీడ్స్, ఉసిరి ముక్కలు, మెంతులు, కరివేపాకు, అవిసెగింజలు, బ్లాక్ సీడ్స్, మందార పువ్వులు అన్నీ వేసి బాగా మరిగించాలి. ఒక 20 నిమిషాల తర్వాత స్టవ్ ఆఫ్ చేసి ఆ నూనెను చల్లార్చాలి. ఈ నూనె నెల రోజుల పాటు నిల్వ ఉంటుంది. ఈ నూనెను ప్రతిరోజ జుట్టు చివర్ల వరకు అప్లై చేయండి. దీన్ని గంట ముందు జుట్టుకు పెట్టుకుని ఆ తర్వాత తలస్నానం చేయొచ్చు. కొద్ది రోజుల్లోనే ఈ నూనె మంచి ఫలితాన్నిస్తుంది. ఈ నూనెను తరచుగా వాడితే జుట్టు పొడవుగా, వత్తుగా పెరుగుతుంది. చుండ్రు సమస్యలు కూడా తొలగిపోతాయి.

# దెబ్బలు తగిలాయి.. రక్తం కారింది



సమంత ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'మా ఇంటి బంగారం'. నందిని రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ ఫ్యామిలీ యాక్షన్-కామెడీ డ్రామా చిత్రం జూన్ 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చెన్నైలో నిర్వహించిన ప్రీ-రిలీజ్ వేడుకలో సమంత (Samantha) మాట్లాడుతూ.. ఇందులో తాను చేసిన యాక్షన్ సీక్వెన్స్‌ల గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.


స్టంట్స్ సహజంగా ఉండడం కోసం తాను పడిన కష్టాన్ని సమంత వివరించారు. "ఇందులో (Maa Inti Bangaaram) ఎలాంటి స్లో-మోషన్ సీక్వెన్స్‌లు, గాల్లో ఎగిరే షాట్లు, అనవసరపు బిల్డప్‌లు ఉండవు. ప్రతిదీ చాలా సహజంగా ఉంటుంది. సినిమాలో చూపించిన యాక్షన్ సన్నివేశాలన్నీ నిజమైనవి. వాటిలో నటిస్తున్నప్పుడు నాకు చాలా దెబ్బలు తగిలాయి. రక్తం కూడా వచ్చింది. ఎంత కష్టమైన సన్నివేశాల్లో అయినా డూప్ ఉపయోగించలేదు. అందుకే చాలా సహజంగా వచ్చాయి. కచ్చితంగా అందరికీ నచ్చుతాయి" అని ధీమా వ్యక్తంచేశారు. తనకు డ్యాన్స్ కంటే యాక్షన్ సన్నివేశాల్లో నటించడమంటేనే ఇష్టమని తెలిపారు. తన సొంత బ్యానర్‌పై ఈ సినిమాను సమంత నిర్మించారు. U/A సర్టిఫికెట్ పొందిన ఈ చిత్రం మరికొన్ని గంటల్లో ప్రేక్షకుల ముందుకురానుంది.

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌ను మర్యాదపూర్వకంగా కలవడం గురించి సమంత మాట్లాడారు. "నేను ఇప్పటివరకూ ఎవరిని కలిసినా అంత ఉత్సాహంగా, ఆసక్తిగా ఎదురుచూడలేదు. ఆయనను కలవడం కోసం చాలా ఆత్రుతగా ఎదురుచూశా. ఆయన చాలా స్పెషల్. అనుకున్నది చేస్తారని నాకు ముందే తెలుసు. సినిమా సెట్‌లో ఉన్నప్పుడు కూడా ఎప్పుడూ తన లక్ష్యం గురించే ఆలోచించేవారు. దానిపైనే దృష్టిపెట్టారు. ఆయన విజయం అకస్మాత్తుగా వచ్చింది కదా. ఎన్నో ఏళ్ల కష్టమది" అని చెప్పారు. సమంత, విజయ్ కలిసి మూడు సినిమాల్లో నటించిన విషయం తెలిసిందే.

# కెరీర్‌లో ఫస్ట్ టైమ్ అలాంటి పాత్రలో.. రష్మిక 'మైసా'పై లేటెస్ట్ బజ్



నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా'. అనౌన్స్‌మెంట్ నుంచే భారీ హైప్ సొంతం చేసుకున్న ఈ మూవీలో రష్మిక గోండు తెగకు చెందిన గిరిజన మహిళ పాత్రను పోషిస్తున్నది. ఇప్పటికే ఇందులో నుంచి విడుదల చేసిన ప్రచార చిత్రాల్లో ఫెరోషియస్ లుక్స్‌లో కనిపించి సర్‌ప్రైజ్ చేసింది ఈ అమ్మడు.. తన కెరీర్‌లో తొలిసారి ఫుల్‌లెంగ్త్ యాక్షన్ రోల్ చేస్తుండటంతో ఈ సినిమాపై ముందు నుంచే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. అందుకోసం తన ఫిట్ నెస్ విషయంలో కూడా పలు కేర్స్ తీసుకుంటుంది. ఈ క్రమంలోనే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మరో అప్డేట్ వచ్చింది. ఇందులో ఆమె నక్సలైట్ పాత్రలో కనిపించనుందని ఫిలిమ్ వర్గాల నుంచి సమాచారం. వ్యవస్థపై ధిక్కార స్వరం వినిపించే ధీరోదాత్తురాలైన గిరిజన మహిళగా ఆమె పాత్ర అత్యంత శక్తివంతంగా సాగుతుందని టాక్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన న్యూస్‌తో పాటు ఫొటోలు నెట్టింట వైరల్ అవుతుండగా.. రష్మిక ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే.. ఆమె పాత్ర తాలూకు అసలైన వివరాలు తెలియాలంటే చిత్ర బృందం అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి ఉంది. కాగా.. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా పాన్ ఇండియా లెవల్‌లో రిలీజ్ అయ్యేందుకు సిద్ధంగా ఉంది.



# స్టార్ డైరెక్టర్ కుమారుడితో కృతిశెట్టి రొమాన్స్.. ఐరన్ లెగ్ బలే ఛాన్స్ కొట్టేసిందిగా..!

ఇండియా టాప్ మోస్ట్ డైరెక్టర్స్‌లో ఒకరిగా వెలుగుతున్న దర్శకుడు శంకర్ వారసుడు ఆర్జిత్ శంకర్ ఇప్పుడు ఇండస్ట్రీ ఎంట్రీకి సిద్ధం అయ్యాడు. ఇప్పటికే ఆయన కూతురు అదితి శంకర్ హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు కొడుకు ఆర్జిత్ శంకర్ కూడా అదే బాటలో నడుస్తున్నాడు. ఆర్జిత్ మొదట్లో దర్శకుడు కావాలనే లక్ష్యంతో అమెరికాలో ఫిల్మ్ మేకింగ్ నేర్చుకున్నప్పటికీ, ఆ తర్వాత 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా'లో నటనలో శిక్షణ తీసుకున్నారు. ఇప్పుడు హీరోగా ఎంట్రీ ఇచ్చేందుకు సర్వం సిద్ధం అయింది. ఈ చిత్రానికి అట్లీ వద్ద సహాయ దర్శకుడిగా పనిచేసిన అశోక్ దర్శకత్వం వహిస్తున్నట్లు తెలుస్తుండగా.. ఇటీవల ఈ చిత్రం చెన్నైలో ప్రారంభమైంది. 'పాషన్ స్టూడియోస్' సంస్థ నిర్మిస్తోంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి 'దళపతి' విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ హాజరై అర్జిత్ శంకర్‌కు శుభాకాంక్షలు తెలపడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ స్టార్ట్ కాగా.. విడుదల తేదీతో పాటు మిగిలిన వివరాలు త్వరలో అనౌన్స్ చేయనున్నారు మేకర్స్. ఇందులో కథానాయికగా కృతి శెట్టిని ఎంపిక చేశారు. మొన్నటి వరకు ఐరన్ లెగ్ అంటూ ట్రోల్స్ ఎదుర్కొంటున్న ఈ బ్యూటీ.. ఇప్పుడు తెలుగులో అనిల్ రావిపూడి ప్రాజెక్టుతో పాటు తమిళంలో కూడా వరుస ఆఫర్లు అందుకోవడంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు.



# ఆ సినిమా ఫ్లాప్ అని ఎడిటర్ ముందే చెప్పాడు.. ఆ విషయంలో తప్పంతా నాదే



ప్రముఖ కథా రచయిత, దర్శకుడు బివిఎస్ రవి గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలకు కథలను అందించిన ఆయన, దర్శకుడిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. నాగచైతన్య హీరోగా, విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన థాంక్యూ చిత్రానికి కూడా రవినే కథ అందించారు. అయితే మంచి అంచనాల మధ్య విడుదలైన థాంక్యూ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయింది. తాజాగా ఈ సినిమా ఫెయిల్యూర్ పై బివిఎస్ రవి స్పందించారు. ఆయన మాట్లాడుతూ, "సినిమా విడుదలకు ముందే ఎడిటర్ నవీన్ నూలి ఈ చిత్రం ఆశించిన ఫలితాన్ని సాధించకపోవచ్చని చెప్పారు.

రిలీజ్‌కు కొన్ని రోజుల ముందే ఆ విషయం మాకు కూడా అర్థమైంది" అని తెలిపారు. అలాగే విక్రమ్ కె. కుమార్‌ను దేశంలోని అత్యుత్తమ దర్శకుల్లో ఒకరిగా పేర్కొన్న రవి, "ఆయన సాధారణంగా ఫెయిల్యూర్‌ను ఎదుర్కొనే దర్శకుడు కాదు. అలాంటి దర్శకుడి సినిమా ఫెయిల్ అయిందంటే, అది నేను అందించిన కథలో జరిగిన తప్పిదం వల్లేనని భావిస్తున్నాను" అని నిజాయితీగా ఒప్పుకున్నారు. తన వల్ల జరిగిన పొరపాటును ఎలాంటి సంకోచం లేకుండా బహిరంగంగా అంగీకరించిన బివిఎస్ రవి వ్యాఖ్యలు ప్రస్తుతం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి. తప్పును ఇతరులపై నెట్టకుండా బాధ్యతను స్వీకరించడం చాలా అరుదైన విషయం అంటూ పలువురు ఆయనను ప్రశంసిస్తున్నారు.

# శర్వా సింగిల్ టేక్‌కు 200 మంది స్టాండింగ్ ఓవేషన్.. 'భోగి'పై పెరిగిన అంచనాలు



టాలీవుడ్ యువ హీరో శర్వానంద్ ప్రస్తుతం దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న 'భోగి' చిత్రంలో నటిస్తున్నాడు. ఈ సినిమాలో శర్వానంద్ ఇప్పటివరకు కనిపించని మాస్ అవతారంలో ప్రేక్షకులను అలరించనున్నాడు. ఇప్పటికే ఈ చిత్రాన్ని ఆగస్టు 28న విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. దీంతో సినిమా షూటింగ్‌ను వేగంగా పూర్తి చేసే పనిలో చిత్రబృందం నిమగ్నమైంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలోని క్లైమాక్స్ ఎపిసోడ్ చిత్రీకరణ పూర్తయింది. భారీ యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యం ఇచ్చిన ఈ క్లైమాక్స్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉండబోతుందని తెలుస్తోంది. ముఖ్యంగా ఈ సన్నివేశాన్ని శర్వానంద్ సింగిల్ టేక్‌లో పూర్తి చేసి యూనిట్ సభ్యులను ఆశ్చర్యానికి గురి చేసినట్లు సమాచారం. అంతేకాకుండా ఆ సన్నివేశం పూర్తయ్యాక సెట్లో ఉన్న దాదాపు 200 మంది సభ్యులు శర్వానంద్ నటనకు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్లైమాక్స్ సీన్ శర్వానంద్ కెరీర్‌లోనే అత్యుత్తమ సన్నివేశాల్లో ఒకటిగా నిలిచే అవకాశముందని చిత్ర యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటి వరకు ఫస్ట్ లుక్ పోస్టర్లను మినహాయిస్తే పెద్దగా అప్డేట్లు బయటకు రాకపోయినా, ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. మరి 'భోగి' చిత్రంతో శర్వానంద్ ఎలాంటి విజయాన్ని అందుకుంటాడో చూడాలి.

# సవాళ్లని ఎదుర్కొని జీవించిన వారి కథ

చిన్నాభిన్నమైన ప్రపంచంలో ధైర్యానికి నిదర్శనంగా నిలిచి.. సవాళ్లని ఎదుర్కొని జీవించిన వారిని కలవండంటూ 'బట్వారా 1947' సినిమా ప్రపంచంలోని పాత్రధారుల ఫస్ట్‌లుక్ పోస్టర్లని ఇన్‌స్టాలో విడుదల చేసింది చిత్రబృందం. బాలీవుడ్ అగ్రహీరో సన్నీ దేబల్.. ఆయన కుమారుడు కరణ్ దేబల్, ప్రీతి జింటా ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రమిది. షబానా అజ్మీ, అలీఫజల్, అభిమన్యుసింగ్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వం వహిస్తున్నారు. ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని ఆమిర్‌ఖాన్, అపర్ణ పురోహిత్ కలిసి నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న విడుదల కానుంది. తాజాగా చిత్రబృందం సామాజిక మాధ్యమాల్లో ఈ సినిమాలోని పాత్రల పోస్టర్లను ఆవిష్కరించింది. ఇందులో కథానాయిక ప్రీతి జింటా లుక్.. తలుపు దగ్గర నించుని ఆందోళన, ఆశ్చర్యం కలగలిసిన కళ్లతో సినీప్రియుల్ని ఆకట్టుకునేలా ఉంది.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in